మంగళవారం
13-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 232
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

మరోసారి ఆసుపత్రిలో అమెరికా రక్షణమంత్రి

వాషింగ్టన్: కొద్దినెలల క్రితం ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడిన అమెరికా రక్షణమంత్రి లాయిడ్ ఆస్టిన్ మరోసారి ఆసుపత్రిలో చేరారు. అత్యవసర ఆరోగ్య సమస్యతో ఆదివారం వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ సెంటర్‌లో చేరారని పెంటగాన్ ఒక ప్రకటనలో వెల్లడించింది. దాంతో తన రక్షణ శాఖ బాధ్యతలను ఆయన డిప్యూటీ మంత్రి కాథ్లీన్ హిక్స్‌కు బదిలీ చేశారు. ఇటీవల కాలంలో ఆస్టిన్ తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రొస్టేట్ క్యాన్సర్ బారినపడిన ఆయనకు సర్జరీ జరిగింది.

చర్చల సాగదీత

- మంత్రివర్గ ఉప సంఘం భేటీ
- 13 ఉద్యోగ సంఘాల నేతల హాజరు
- మూడు గంటల సుదీర్ఘ మంతనాలు
- మరోసారి భేటీకి అంగీకారం
- ఉద్యమం యథాతథం: ఏపీ జేఏసీ

2లో

వైసీపీ రెబల్ ఎమ్మెల్యేల డుమ్మా

స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
అనర్హత పిటిషన్లపై స్పీకర్ వద్ద విచారణకు వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు సోమవారం కూడా హాజరుకాలేదు. గతంలో ఒకసారి గైర్హాజరైన ఎమ్మెల్యేలను ఈనెల 12వ తేదీ ఉదయం విచారణకు హాజరుకావాలంటూ మరలా స్పీకర్ కార్యాలయం నోటీసులు పంపింది. వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి విచారణకు హాజరు కావాల్సి ఉంది. వివిధ కారణాల దృష్ట్యా తాము విచారణకు హాజరు కాలేకపోతున్నామని స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కి వైసీపీ రెబల్ ఎమ్మెల్యేలు లేఖ రాశారు. తాము అనారోగ్య కారణాల దృష్ట్యా హాజరు కాలేక పోతున్నట్టు ఒకరిద్దరు లేఖలు రాశారు. తమకు కొంత సమయం కావాలని కోరారు. రాజ్య సభ ఎన్నికల నేపథ్యంలో రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే అంశం తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. విచారణకు వరుసగా గైర్హాజరు అవుతున్నందున స్పీకర్ నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికా... ఏకగ్రీవమా ?

- రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ
- నామినేషన్లకు మూడు రోజులే గడువు
- టీడీపీ నిర్ణయంపై ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల వ్యవహారం ఆసక్తికరంగా మారింది. నామినేషన్ల దాఖలుకు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో టీడీపీ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అవసరమైన బలం లేకున్నా టీడీపీ అభ్యర్థి ఊహించని విధంగా విజయం సాధించడంతో మరలా ఆ పరిస్థితి పునరావృతమవుతుందేమోనన్న భావన రాజకీయవర్గాల్లో నెలకొంది. ఏపీ నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది. దీంతో దేశవ్యాప్తంగా అదే తేదీకి ఖాళీ కానున్న 56 స్థానాల భర్తీలో భాగంగా ఏపీలో మూడు స్థానాలకు ఈనెల 8వ తేదీన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ నుంచి సీఎం రమేష్, టీడీపీ నుంచి కనకమేడల రవీంద్ర కుమార్ పదవీకాలం పూర్తవుతుంది. వాస్తవానికి రాష్ట్ర శాసనసభలో శాసనసభ్యుల సంఖ్యాబలం ఆధారంగా ఈ మూడు స్థానాలూ వైసీపీ సునాయసంగా గెల్చుకుంటుంది. ఒక్కో రాజ్యసభ సభ్యుడు గెలవాలంటే 44 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. వైసీపీకి ప్రస్తుతం సభలో 151 మంది ఉన్నారు. దీంతో టీడీపీ తరపున ఎవరూ నామినేషన్ దాఖలు చేయని పక్షంలో ముగ్గురు సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా గెలుచుకొనే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వైసీపీ నుంచి వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, రఘునాథరెడ్డిలకు అభ్యర్థిత్వాలు ఖరారు చేయగా, వారు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ టీడీపీ కూడా రాజ్యసభ ఎన్నికలకు పోటీ చేసేందుకు ఇప్పటికే నామినేషన్ పత్రాలు తీసుకోవడం వైసీపీ నేతలను కలవర పరుస్తోంది. అయితే అభ్యర్థిని మాత్రం టీడీపీ ఇంకా ఖరారు చేయలేదు. ఈనెల 15వ తేదీతో నామినేషన్ల దాఖలుకు చివరి గడువు. దీంతో వైసీపీ నేతల్లో, నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో అసలు టీడీపీ పోటీ చేస్తుందా ? లేదా ? అనేది తెలియక టెన్షన్ నెలకొంది. టీడీపీకి ప్రస్తుతం సభలో 18 మంది సభ్యుల బలం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి సహకరించిన వైసీపీ నలుగురు శాసనసభ్యులపై చర్యలు తీసుకునే పనిలో స్పీకర్ ప్రస్తుతం కసరత్తు నిర్వహిస్తున్నారు. స్పీకర్ వారిపై చర్య తీసుకుంటే టీడీపీ దాదాపు 26 మంది వైసీపీ శాసనసభ్యుల మద్దతు కూడగట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం వైసీపీలో 32 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో సీట్లు గల్లంతయ్యాయి. వీరిలో చాలామంది బహిరంగం గానే వైసీపీ అధిష్ఠానంపై అసంతృప్తి వెళ్లగక్కారు. టీడీపీ పోటీ చేస్తే వీరందర్నీ కాపాడుకోవడానికి వైసీపీ నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అదే టీడీపీ పోటీ చేయని పక్షంలో ఈనెల 15వ తేదీకే ఎన్నికల ఫలితం తేలిపోతుంది. ఏకగ్రీవంగా వైసీపీ ముగ్గురు అభ్యర్థులు విజయం సాధిస్తారు. ఈ నేపథ్యంలో టీడీపీ నిర్ణయం ఎలా ఉండబోతుందన్న దానిపై ముఖ్యంగా వైసీపీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైసీపీ అసంతృప్తి ఎమ్మెల్యేలపై అధిష్ఠానం పూర్తి నిఘా ఉంచింది. టీడీపీ పోటీ చేసినా తమ సభ్యులు చేజారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇక టీడీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, ఒకవేళ పోటీ చేసి అభ్యర్థి ఓటమి చెందినా రాజ్యసభలో తొలిసారి ప్రాతినిధ్యం కోల్పోనుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత రాజ్యసభలో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి ఇదే మొదటిసారి కావడం గమనార్హం. రాష్ట్ర కోటా ప్రకారం మొత్తం 11 మంది రాజ్యసభ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు పెద్దల సభలో ఆసీనులుకానున్నారు.

రైతును అడ్డుకునే కుట్ర

- అడుగడుగునా ఆంక్షలు
- ఢిల్లీలో నెలరోజులు 144 సెక్షన్
- సరిహద్దుల మూసివేత

న్యూఢిల్లీ:
అన్నదాతలపై కేంద్ర ప్రభుత్వం కన్నెర్ర చేసింది. రైతుల ఆందోళనలను ఉక్కుపాదంత అణచివేస్తోంది. రైతుల ఢిల్లీ చలో కార్యక్రమాన్ని అడ్డుకునేందుకుగాను నెల రోజులపాటు దేశరాజధానిలో 144 సెక్షన్ విధిస్తూ సోమవారం ఢిల్లీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం 'ఢిల్లీ చలో' పేరుతో ఆందోళన చేపట్టాలని రైతులు నిర్ణయించడంతో ఈ ఆంక్షలు విధించారు. నగరంలో ట్రాక్టర్ల ప్రవేశానికి అనుమతి ఉండదని వెల్లడించారు. తుపాకులు, మండే స్వభావం ఉన్న పదార్థాలు, ఇటుకలు, రాళ్లు, పెట్రోల్, సోడా బాటిళ్ల వంటి వాటిని వెంట తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధించారు. లౌడ్ స్పీకర్ల వాడకంపైనా ఆంక్షలు వర్తిస్తాయని తెలిపారు. 'ఢిల్లీ చలో' ఆందోళనలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 20 వేలమంది రైతులు ఢిల్లీకి వచ్చే

- మిగతా 2 లో

మోదీ, జగన్‌కు గుణపాఠం తప్పదు

- లక్షల కోట్ల అప్పుతో దివాలా తీయించారు
- బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలపై 20న విజయవాడలో సదస్సు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:
అటు దేశాన్ని ఇటు రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుతో దివాళా తీయించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం జగన్ మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో సీపీఐ అనంతపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్‌తో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడంలో, ప్రతిపక్ష పార్టీలను బ్లాక్‌మెయిల్ చేయడంలో మోదీ సిద్ధహస్తుడని విమర్శించారు. 370 సీట్లు తామే గెలుస్తామని, ఎన్‌డీఏ కూటమి నాలుగు వందలకు పైగా సీట్లలో విజయం సాధిస్తుందని మోదీ దేశమంతా ప్రచారం చేసుకుంటున్నాడని, అదే పంథాలో సీఎం జగన్ వైనాట్ 175 అంటూ కాపీ కొడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఓటమి భయంతోనే సీఎం జగన్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలను వారి నియోజకవర్గాల బదిలీ చేస్తున్నాడని, అభ్యర్థులను మార్చడం, డబ్బున్న వారిని పార్టీలో చేర్చుకుంటున్నాడని విమర్శించారు. ప్రధాని మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ ఎన్‌డీఏ కూటమిలో చేరాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను జైలుకు పంపిస్తానని బెదిరించడం దుర్మార్గమన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలను చీల్చే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీతో కలవకూడదని, బీజేపీతో కలిసినంత మాత్రాన రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగదని టీడీపీ నాయకులే 90 శాతం మంది చెబుతున్నారని తెలిపారు. చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టించడంలో, 17ఏ రద్దును అడ్డుకోవడంలో బీజేపీ పాత్ర ఉందని టీడీపీ వారే చెబుతున్నారన్నారు. ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, నల్లధనాన్ని

- మిగతా 2 లో

నవాజ్ పార్టీతో పొత్తుకు భుట్టో సుముఖత

పాక్‌లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చర్చల్లో పురోగతి

2లో

వైసీపీ సీట్ల కసరత్తు

సీఎం జగన్‌తో బాలినేని, వల్లభనేని, కొడాలి నాని చర్చలు

8లో

ఇదీ లోకం!

డీఎస్సీకి రెడీ

- నోటిఫికేషన్ జారీ చేసిన మంత్రి బొత్స
- జిల్లాల వారీగా ఖాళీల వెల్లడి
- జీవోలు 11, 12 విడుదల
- మార్చి 15 నుంచి 30 వరకు పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రంలో 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ 2024 నోటిఫికేషన్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేశారు. రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్‌తో కలిసి డీఎస్సీ 2024 ప్రత్యేక వెబ్‌సైట్‌ను, డీఎస్సీ నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన జీవోలు (11, 12)లను మంత్రి సోమవారం విడుదల చేశారు. అనం తరం డీఎస్సీ 2024 ఖాళీలు, పరీక్షల వివరాలను మంత్రి బొత్సతోపాటు ప్రవీణ్ ప్రకాశ్, సురేశ్‌కుమార్ వెల్లడించారు. డీఎస్సీ 2024

- మిగతా 2 లో



ఏప్రిల్ 27న పాలిసెట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ప్రవేశం కోసం 'పాలిసెట్-2024' ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 27న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. పదవ తరగతి తర్వాత ఉజ్వల భవిష్యత్తు, పిన్నవయస్సులోనే ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఉత్తమమైన మార్గం పాలిటెక్నిక్ విద్య మాత్రమేనన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో పాలిటెక్నిక్ విద్యపై మరింత అవగాహన పెంపొందించే క్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి రూపొందించిన సమాచార కరదీపిక,

- మిగతా 2 లో

నెగ్గిన నితీశ్ సర్కార్

- విశ్వాస తీర్మానానికి 130 మంది అనుకూలం
- ఎన్‌డీఏలోకి ముగ్గురు ఆర్‌జేడీ ఎమ్మెల్యేలు జంప్
- స్పీకర్ అవధ్ చౌదరికి వ్యతిరేకంగా తీర్మానం ఆమోదం
- సభ నుంచి వాకౌట్ చేసిన ఆర్‌జేడీ, ఇతర విపక్ష సభ్యులు

పాట్నా:
బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని సంకీర్ణ ఎన్‌డీఏ ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని నెగ్గింది. 243 మంది సభ్యులున్న అసెంబ్లీలో 130 మంది సభ్యులు విశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారు. సభ్యుల సంఖ్యను లెక్కిస్తున్న సమయంలో ఆర్‌జేడీ నేతృత్వంలోని ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అధ్యక్ష స్థానంలో

- మిగతా 2 లో

నవాజ్ పార్టీతో పొత్తుకు భుట్టో సుముఖత

పాక్‌లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు చర్చల్లో పురోగతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు దిశగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్థాన్ ముస్లిం లీగ్- నవాజ్ (పీఎంఎల్-ఎన్) పార్టీ యత్నిస్తోంది. ఇందుకోసం బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)తో జరుపుతున్న చర్చల్లో పురోగతి సాధించింది. పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ, అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీతో తమ అధ్యక్షుడు షెహబాజ్ షరీఫ్ ఆదివారం జరిపిన చర్చల్లో చాలా అంశాలపై సఖ్యత కుదిరినట్లు పీఎంఎల్-ఎన్ ప్రకటించింది. రాజకీయ అనిశ్చితి నుంచి దేశాన్ని రక్షించేందుకు రెండు పార్టీల మధ్య సూత్రప్రాయంగా అంగీకారం కుదిరిందని పేర్కొంది. త్వరలో జరగబోయే సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో పీపీపీ నాయకత్వం వారి ప్రతిపాదనలను తమ ముందు ఉంచుతుందని తెలిపింది. యావత్ పాకిస్థాన్ పరిస్థితిని సమీక్షించి, ప్రస్తుతం నెలకొన్న రాజకీయ అనిశ్చితిని తొలగించాలని నిర్ణయించినట్లు పీఎంఎల్-ఎన్ పార్టీ పేర్కొంది. భవిష్యత్‌లో రాజకీయ సహకారంపైన కూడా పూర్తి వివరంగా చర్చించినట్లు వెల్లడించింది. ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు తమ పక్షానే నిలిచారని మరోసారి ప్రకటించింది. పీఎంఎల్-ఎన్‌తో కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించినట్లు పీపీపీ కూడా ధ్రువీకరించింది. ఆదివారం పాకిస్థాన్ ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఫలితాల ప్రకారం, 265 జాతీయ అసెంబ్లీ సీట్లకు జరిగిన ఎన్నికల్లో పీఎంఎల్-ఎన్‌కు 75 స్థానాలు దక్కాయి. ఇమ్రాన్ సారథ్యంలోని పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ నుంచి స్వతంత్రులుగా పోటీచేసిన అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాలు సాధించారు. అయితే పీఎంఎల్-ఎన్ అధికారంలోకి రావాలంటే 54 సీట్లలో విజయం సాధించిన పీపీపీ మద్దతు లేకుండా సాధ్యపడదు. పీఎంఎల్-ఎన్, పీపీపీ పార్టీలు కలిస్తే మొత్తం 129 సీట్లు అవుతాయి. మరో పక్క 17 సీట్లు నెగ్గిన ఎంక్యూఎం-పీతోనూ నవాజ్ షరీఫ్ చర్చలు జరుపుతున్నారు. దేశంలో ప్రభుత్వ ఏర్పాటుకు మొత్తం 133 సీట్లు అవసరం. ఈ మూడు పార్టీలు కలిస్తే అధికారం సొంతమవుతుంది. కానీ ఈ పొత్తుకు ఇంకా ఎంక్యూఎం-పీ సుముఖత చూపలేదు. దీంతో పాకిస్థాన్‌లో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై ఇంకా ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

ప్రభుత్వాన్ని మేమే ఏర్పాటు చేస్తాం: పీటీఐ

మరోవైపు ఇమ్రాన్ సారథ్యంలోని పీటీఐ మాత్రం తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమాగా చెబుతోంది. తాము 170 స్థానాల్లో నెగ్గామని అధికారులు అక్రమాలు చేసి తమ అభ్యర్థులను ఓడించారని ఆరోపిస్తోంది. ఈ మేరకు ఓడిపోయిన పీటీఐ అనుకూల స్వతంత్ర అభ్యర్థులు న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. మరోవైపు వివిధ కేసుల్లో జైలులో శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్‌ఖాన్ పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో హవా చూపించారు. ఎన్నికల సంఘం ప్రకారం 265 జాతీయ అసెంబ్లీ సీట్లలో ఇమ్రాన్ నేతృత్వంలోని పీటీఐ పార్టీ నుంచి స్వతంత్రులుగా పోటీ చేసిన అభ్యర్థులు 101 స్థానాల్లో గెలుపొందారు. పీటీఐ బ్యాట్ గుర్తును ఎన్నికల సంఘం రద్దు చేయడం వల్ల ఆ పార్టీ అభ్యర్థులు వివిధ గుర్తులతో ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసి నెగ్గారు. ఇక పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసిన ఆ దేశ సైన్యం ఆ దిశగా అడుగులు వేస్తోంది. మాజీ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

రఫాపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు

67మంది పలస్తీనియన్ల మృతి

రఫా: అనేక దేశాలు వారిస్తున్నప్పటికీ గాజాపై ఇజ్రాయిల్ దూకుడు తగ్గడం లేదు. అర్ధరాత్రి వేళ దక్షిణ గాజాలోని రఫా నగరంపై వైమానిక దాడులు జరపడంతో 67 మంది పలస్తీనియన్లు మృతి చెందారు. ఈ విషయాన్ని రఫా ఆస్పత్రి అధికారులు ధృవీకరించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారని చెప్పారు. అయితే ఈ దాడుల్లో హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిలో ఇద్దరిని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించుకుంది. రఫా నగరంలో అర్ధరాత్రి చేపట్టిన ఆపరేషన్‌లో వారిని రక్షించినట్లు సోమవారం తెల్లవారుజామున ఇజ్రాయిల్ రక్షక దళాలు (ఐడీఎఫ్) ప్రకటించింది. 'రఫాలో ఐడీఎఫ్, ఐఎస్ఏ (షిన్‌బెట్ సెక్యూరిటీ ఏజెన్సీ), పోలీసులు జరిపిన దాడుల్లో ఇజ్రాయిల్‌కు చెందిన ఫెర్నాండో సిమోన్ మార్మన్ (60), లూయిస్ హర్ (70)ను హమాస్ చెర నుంచి కాపాడాం. వీరిని గతేడాది అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు నిర్ యిత్జక్ కిబుట్జ్ నుంచి కిడ్నాప్ చేశారు' అని సైన్యం తెలిపింది. ప్రస్తుతం వారిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పేర్కొంది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై దాడి చేసిన హమాస్ దాదాపు 250 మందిని బంధించింది. ఆ తర్వాత కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా వీరిలో కొంతమందిని విడుదల చేశారు. ఇంకా 136 మంది హమాస్ చెరలో ఉండగా వీరిలో ఇద్దరిని కాపాడినట్లు ఇజ్రాయిల్ చెబుతోంది. అయితే, బందీల్లో దాదాపు 30 మంది ఇప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

దాడుల్ని ఖండించిన వివిధ దేశాలు

దక్షిణ గాజాలోని రఫా నగరంపై ఇజ్రాయిల్ దాడులు తీవ్రతరం చేయడాన్ని అనేక దేశాలు తప్పుబడుతున్నాయి. గాజాలో దాడులు ప్రారంభమైన తర్వాత లక్షల మంది రఫాకు నిరాశ్రయులుగా వెళ్లి తలదాచుకుంటున్నారు. అక్కడా దాడులు ప్రారంభం కావటంతో సామాన్య పౌరులు బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో ఈజిప్టు, ఖతార్, సౌదీ సహా వివిధ దేశాలు ఈ దాడులను ఖండించాయి. అటు అమెరికా కూడా ఇజ్రాయిల్ వైఖరిని వ్యతిరేకించింది. కాగా ఐడీఎఫ్ సంచలన ఆరోపణలు చేసింది. ఓ ప్రముఖ మీడియా సంస్థలో పనిచేస్తున్న పలస్తీనా జర్నలిస్టు హమాస్ ముఠాలో కీలక సభ్యుడని పేర్కొంది. ఉత్తర గాజాలో జరిపిన భూతలదాడుల్లో భాగంగా తాము సేకరించిన ల్యాప్‌టాప్, పత్రాల్లో లభించిన సమాచారంతో ఈ విషయాన్ని గుర్తించినట్లు తెలిపింది. గత కొన్ని నెలలుగా ఆ పత్రిక ప్రసారాల్లో విరివిగా కన్పించిన ఆ జర్నలిస్టు.. హమాస్‌కు చెందిన యాంటీ ట్యాంక్ మిసైల్ యూనిట్ సీనియర్ కమాండర్ అని వెల్లడించింది.

నిక్కీపై ట్రంప్ వ్యాఖ్యల్ని తప్పుబట్టిన బైడెన్



వాషింగ్టన్: రిపబ్లికన్ పార్టీ నుంచి అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్న నిక్కీ హేలీ భర్తను ఉద్దేశిస్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఖండించారు. దేశానికి సేవలందిస్తున్న సైనికుడి పట్ల ట్రంప్ వైఖరిని తప్పుబట్టారు. నిక్కీ భర్త మైఖేల్ హేలీ ఒక సైనికుడు. గత ఏడాది జూన్ నుంచి 'హార్న్ ఆఫ్ ఆఫ్రికా' ప్రాంతంలో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలియని ట్రంప్ తన ప్రత్యర్థి నిక్కీని ఇరుకున పెట్టేందుకు మైఖేల్‌పై నోరు పారేసుకున్నారు. 'ఆమె భర్త ఎక్కడ? ఆయన దూరంగా ఉన్నారు. ఇంతకీ అతడికి ఏమైంది?' అంటూ ప్రశ్నించారు. ట్రంప్ వ్యాఖ్యలపై బైడెన్ మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. 'ట్రంప్ ప్రశ్నకు సమాధానం ఏమిటంటే.. మేజర్ హేలీ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నారు. ఆయన దేశానికి సేవ చేస్తున్నారు. మన సైనికులను ట్రంప్ మోసగాళ్లలా చూస్తారన్న విషయం తెలిసిందే. కానీ, ఏదైనా ఆయనకు ఇబ్బందిగా అనిపిస్తే... అప్పుడు దేశసేవ కనిపించదు' అని అర్థం వచ్చేట్లు 'ఎక్స్' వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ తనపై చేసిన వ్యాఖ్యలకు నిక్కీ కూడా ఘాటుగా బదులిచ్చారు. తన భర్త సేవలు గర్వకారణమంటూ.. ట్రంప్ మానసిక సామర్థ్యంపై విమర్శలు గుప్పించారు. ఆయన మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు.

డీఎస్సీకి రెడీ

(మొదటిపేజీ తరువాయి)

పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 12వ తేదీ (సోమవారం) నుంచి 22 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. డీఎస్సీ పరీక్షల రుసుము ఈనెల 21లోగా చెల్లించాలి. మొత్తం ఖాళీల్లో ఉమ్మడి 13 జిల్లాల ఆధారంగా వివిధ ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో ఎస్జీటీలు 2,280, స్కూల్ అసిస్టెంట్లు 2,299, ట్రైన్ గ్రాడ్యుయేట్ టీచర్లు(టీజీటీ) 1,264, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ) 215, ప్రిన్సిపాళ్లు 42 చొప్పున ఉన్నాయి. ఈ పోస్టులకు జనరల్ అభ్యర్థుల వయోపరిమితి జులై 1, 2024 నాటికి 18 నుంచి 44 ఏళ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయోపరిమితి సడలింపు ఇచ్చారు. వయోపరిమితికి సంబంధించి జనరల్ అభ్యర్థులకు ప్రభుత్వం ఎలాంటి సడలింపు ఇవ్వలేదు. 2018 డీఎస్సీ సిలబస్ ఆధారంగానే పరీక్షలు నిర్వహిస్తారు. మార్చి 15 నుంచి 30 వరకు (సెలవు రోజులు మినహా) డీఎస్సీ పరీక్షలను ప్రతి రోజూ రెండు సెషన్లుగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. మొత్తం 122 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశారు. సెషన్ 1 పరీక్షను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెషన్ 2 పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. ప్రతి రోజూ 35 వేల నుంచి 40 వేల మంది పరీక్షలు రాసేందుకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. హాల్ టికెట్లను 5వ తేదీన ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. డీఎస్సీ ప్రాథమిక కీని మార్చి 31న విడుదల చేసి, ఏప్రిల్ 1వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఏప్రిల్ 2న తుది కీ విడుదల చేసి, ఫలితాలు 7న వెల్లడిస్తారు. డీఎస్సీ పరీక్షలను 80 మార్కులకు నిర్వహిస్తారు. టెట్‌లో 20 శాతం వెయిటేజీ, డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా ప్రతిభా జాబితా రూపొందిస్తారు. డీఎస్సీ 2024 సిలబస్, పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డీఎస్సీకి సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ నంబర్లు 9505619127, 9705655349ను ఏర్పాటు చేశారు.

ఉద్యోగుల నియామక ప్రక్రియ పారదర్శకం: మోదీ

న్యూదిల్లీ: నియామకాల ప్రక్రియను తమ ప్రభుత్వం పారదర్శకంగా మార్చిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. 'రోజ్‌గార్ మేళా' కింద ఉద్యోగాలు పొందిన లక్షమందికిపైగా అభ్యర్థులకు మోదీ సోమవారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం నియామక ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తోందన్నారు. దీంతో ప్రతి ఒక్క అభ్యర్థి తన సామర్థ్యం ప్రదర్శించేలా సమాన అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అభ్యర్థి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొన్న నాటి నుంచి అపాయింట్‌మెంట్ లేఖ అందుకొనే వరకూ ఉన్న సమయాన్ని కుదించామన్నారు. గత ప్రభుత్వాలు నియామక ప్రక్రియల్లో జాప్యం చేసేవని, దీంతో అవి సుదీర్ఘంగా సాగేవని, ఆ సమయంలో లంచాల వసూళ్లు వంటివి జోరుగా చోటు చేసుకొనేవని పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. కానీ, తమ ప్రభుత్వం నియామకాలను పారదర్శకంగా చేపడుతోందని, దేశానికి యువత సేవ చేసేలా 2014 నుంచి వారికి సహకరించాలని తమ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. తమ 'వికసిత్ భారత్' ప్రయాణంలో ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగిదీ కీలక పాత్రేనన్నారు. నేడు కొత్తగా చేరుతున్న లక్షమంది ఉద్యోగులు ప్రభుత్వానికి నూతన శక్తి అందిస్తారన్నారు. వారు ఏ శాఖలో చేరారన్నది ముఖ్యం కాదు, దేశానికి అంకిత భావంతో సేవ చేయడం కీలకమన్నారు. గత ప్రభుత్వంతో పోల్చుకొంటే ఈ పదేళ్లలో తాము 1.5 రెట్లు అదనంగా ఉద్యోగావకాశాలు కల్పించామని ప్రధాని తెలిపారు. యువతకు 10 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో మోదీ అక్టోబర్ 2022లో 'రోజ్‌గార్ మేళా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజాగా ఆయన 'కర్మయోగి భవన్'కు శంకుస్థాపన చేశారు. 'మిషన్ కర్మయోగి' కింద వివిధ వర్గాలను సమన్వయం చేసుకోవడానికి ఈ భవనాన్ని వినియోగించనున్నారు. సామర్థ్యాల పెంపునకు అవసరమైన సంకల్పాన్ని ఇది బలోపేతం చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రధాని తెలిపారు.

ఆశిష్ మిశ్రాకు మధ్యంతర బెయిల్ పొడిగింపు

న్యూదిల్లీ: ఎనిమిది మంది ప్రాణాలను బలిగొన్న లఖింపూర్ ఖేరీ హింసాకాండ (2021) కేసులో ప్రధాన నిందితుడైన కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాకు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను సుప్రీంకోర్టు సోమవారం పొడిగించింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం కేసు పురోగతిపై ట్రయల్ కోర్టు నుంచి నివేదికను పొందాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీని ఆదేశిస్తూ కేసును వాయిదా వేసింది. విచారణ తేదీ సెప్టెంబరు 26, 2023 నుంచి ట్రయల్ కోర్టు నుంచి ఎటువంటి నివేదిక అందలేదని తెలిపింది. జనవరి 25న ట్రయల్ కోర్టు మిశ్రాకు విధించిన మధ్యంతర బెయిల్ షరతులను సడలించిన అత్యున్నత న్యాయస్థానం... ఈ కాలంలో ఉత్తరప్రదేశ్‌లో గానీ, దిల్లీలో గానీ ఉండరాదని మిశ్రాను ఆదేశించింది. తన తల్లిని రామ్ మనోహర్ లోహియా (ఆర్‌ఎంఎల్)లో చేర్చారని పేర్కొంటూ మిశ్రా దాఖలు చేసిన సవరణ దరఖాస్తుపై కోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లా టికునియాలో 2021 అక్టోబర్ 3న రైతులపై జరిగిన హింసాకాండ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. కేంద్రమంత్రి అజయ్ మిశ్రా పర్యటనలో నిరసన చేస్తున్న రైతులపైకి ఆయన కుమారుడు ఆశిశ్ మిశ్రా కారుతో దూసుకెళ్లాడని ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి. ఈ ఘటనలో నలుగురు రైతులు మరణించగా... ఆ తర్వాత జరిగిన ఘర్షణల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

రాజ్యాంగ ఉల్లంఘన కాదు

డిప్యూటీ సీఎంల నియామకంపై సుప్రీం



న్యూదిల్లీ: రాష్ట్రాల్లో ఉపముఖ్యమంత్రులను నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ విధానం అవలంబించడం రాజ్యాంగ ఉల్లంఘన కాదని స్పష్టం చేసింది. డిప్యూటీ సీఎంల నియామకాన్ని సవాల్ చేస్తూ పబ్లిక్ పొలిటికల్ పార్టీ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడం రాజ్యాంగంలోని నిబంధనను ఉల్లంఘించడమేనని, దీనిద్వారా రాష్ట్రాలు తప్పుడు సంతకేతాలు ఇస్తున్నాయని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై తాజాగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఇది రాజ్యాంగ విరుద్ధమేమీ కాదని వెల్లడించింది. పార్టీ లేదా సంకీర్ణ ప్రభుత్వంలోని సీనియర్ నాయకులకు కాస్త ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడానికి చాలా రాష్ట్రాలు ఉపముఖ్యమంత్రిని నియమించే పద్ధతి అవలంబిస్తున్నాయని, అయితే, అది కేవలం ఒక పేరు మాత్రమేనని, డిప్యూటీ సీఎంగా ఎవరిని నియమించినా వారు కేబినెట్ మంత్రి హోదాలోనే ఉంటారని స్పష్టంచేసింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వానికి ఉపముఖ్యమంత్రి మొట్టమొదటి, అత్యంత ముఖ్యమైన మంత్రిగా ఉంటారని, ఇది రాజ్యాంగ ఉల్లంఘన కిందకు రాదని ధర్మాసనం పేర్కొంది. ముఖ్యమంత్రికి సహాయ సహకారాలు అందించేందుకు, సీనియర్లకు తగిన ప్రాధాన్యం కల్పించేందుకు చాలా రాష్ట్రాలు డిప్యూటీ సీఎంలను నియమిస్తుంటాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒకరి కంటే ఎక్కువ ఉపముఖ్యమంత్రులు ఉన్న సందర్భాలున్నాయి. అయితే, వారికి కేబినెట్ మంత్రి హోదాలోనే వేతనం, ఇతర సదుపాయాలు అందిస్తారు.

రైతును అడ్డుకునే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలున్నాయని నిఘావర్గాలు అంచనా వేశాయి. ఈ ఆందోళనను ఎలా చేపట్టాలన్న దానిపై రైతు సంఘాలు 40 సార్లు రిహార్సల్ నిర్వహించాయని, అందులో పంజాబ్‌లో 30, హరియాణాలో 10 జరిగాయని తెలిపాయి. 2,000-2,500 ట్రాక్టర్లను మంగళవారం దేశ రాజధానికి తీసుకొచ్చేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నాయి. పంజాబ్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్నాటకల నుంచి కర్షకులు కార్లు, ద్విచక్రవాహనాలు, మెట్రో, రైళ్లు, బస్సుల ద్వారా దిల్లీకి చేరుకుంటారని తెలిపాయి. దాంతో హరియాణా, దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. అనేకచోట్ల సరిహద్దులను మూసివేసి... భారీగా బలగాలు మోహరించారు. పంజాబ్‌తో తమ రాష్ట్ర సరిహద్దును అంబాలా సమీపంలోని శంభు వద్ద హరియాణా పోలీసులు మూసివేశారు. రహదారిపై ఇసుక సంచులు, ముళ్ల కంచెలు, కాంక్రీటు దిమ్మెలు అడ్డుగా పెట్టారు. అల్లర్ల నిరోధక బలగాల వాహనాలు నిలిపి ఉంచారు. అత్యవసరమైతే తప్ప రాష్ట్రంలోని ప్రధాన రోడ్లపై ప్రయాణించవద్దని ప్రజలకు సూచించారు. ఇప్పటికే దిల్లీ సరిహద్దు ప్రాంతాల్లో అనేకచోట్ల 144 సెక్షన్ విధించారు. ఇదిలా ఉంటే... ముగ్గురు కేంద్రమంత్రులతో కూడిన బృందం రైతు ప్రతినిధులతో రెండోసారి చర్చలు జరపనుంది. దానిలో భాగంగా పీయూష్ గోయల్, అర్జున్ ముండా, నిత్యానంద రాయ్ చండీగఢ్‌లో వారితో చర్చించనున్నారు. ఫిబ్రవరి ఎనిమిదిన రెండు వర్గాల మధ్య ఒకసారి భేటీ జరిగింది. దిల్లీ మార్చ్ కోసం ఇప్పటికే పంజాబ్‌లోని అనేక గ్రామాల నుంచి ట్రాక్టర్లు బయలుదేరాయి.

ఏప్రిల్ 27న పాలిసెట్

(మొదటిపేజీ తరువాయి)

కరపత్రాలు, పోస్టర్‌లను సోమవారం సాంకేతిక విద్యా శాఖ కేంద్ర కార్యాలయంలో నాగరాణి ఆవిష్కరించారు. ఈ ప్రచార కరదీపికలో పాలిటెక్నిక్ విద్యతో కలిగే ప్రయోజనాలు, అనంతరం విద్యార్థులకు ఉపాధి అవకాశాలు, జీతభత్యాల వివరాలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష గురించి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు పదవ తరగతి పరీక్షలు పూర్తయిన వెంటనే రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉచితంగా పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ లేబరేటరీలను ఆధునీకరించి, వసతి కల్పనను సైతం మెరుగుపరచామని, ఎన్‌బీఏ గుర్తింపు పొందిన కళాశాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ సంసిద్ధంగా ఉందని నాగరాణి వివరించారు. అలాగే, పాలిటెక్నిక్ విద్య పూర్తయిన వెంటనే సత్వర ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ పరిశ్రమలతో ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి కార్యదర్శి రమణ బాబు, సంయుక్త కార్యదర్శి జీవీవీఎస్ ఎన్ మూర్తి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జానకి రామయ్య, ఉప కార్యదర్శులు డీఎస్ఎస్ఎన్‌వీ ప్రసాద్ బాబు, రవికుమార్, వేణు మాధవ్, ఓఎస్డీ రత్నసాగర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చల సాగదీత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై రాష్ట్ర సచివాలయలో మంత్రివర్గ ఉపసంఘం అధ్వర్యంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం సోమవారం చర్చించింది. మూడు గంటలపాటు కొనసాగిన సమావేశంలో అనేక అంశాలపై చర్చించినప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. మరోసారి భేటీ కావాలని నిర్ణయించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, ఎన్.గుల్జార్, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, జీఏడీ అదనపు శాఖ కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు తదితర అధికారులు హాజరయ్యారు. 13 ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. పెండింగ్ డీఏ, ఐఆర్, పీఆర్సీ, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ తదితర డిమాండ్లపై చర్చించారు. వాటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, ఏపీ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఎస్టీయూతోపాటు వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగుల సమస్యలను వివరించారు. ప్రభుత్వంతో చర్చలు సఫలం కాకపోతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఇప్పటికే ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించిన విషయం విదితమే. ఈ చర్చల్లోనూ డిమాండ్లపై స్పష్టత రాకపోవడంతో ఉద్యోగ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఉద్యమ కార్యాచరణ యథాతథంగా కొనసాగిస్తామని బండి శ్రీనివాసరావు వెల్లడించారు. ఉద్యోగ సంఘాలతో భేటీ అనంతరం మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టబడి ఉందన్నారు. త్వరగా ఉద్యోగుల పెండింగ్ డీఏ అంశాలు పరిశీలించాలని సీఎస్, ఆర్థికశాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు.

ఎస్టీయూ డిమాండ్లు ఇవీ...

మంత్రివర్గ ఉపసంఘం ముందుకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న వివిధ డిమాండ్లు తీసుకెళ్లారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకురావాలని కోరారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, గురుకుల ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు వర్తింపజేయాలని, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కాంట్రాక్టు టీచర్లను క్రమబద్ధీకరించాలని, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. 2024 డీఎస్సీ నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని విడనాడాలని, సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలని, మున్సిపల్ టీచర్ల అంతర్ జిల్లాల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు తక్షణమే విడుదల చేయాలన్నారు.

నెగ్గిన నితీశ్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హాజరయి, మూజు వాణి ఓటు ద్వారా విశ్వాస తీర్మానంపై అధికార జేడీయూ విజయం సాధించినట్లు ప్రకటించారు. అయితే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజయ్ కుమార్ చౌదరి జోక్యంతో డిప్యూటీ స్పీకర్ సభ్యుల సంఖ్యను లెక్కించేందుకు అనుమతించారు. అంతకుముందు, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్, ఆర్‌జేడీ నాయకుడు అవధ్ బీహార్ చౌదరిని తొలగిస్తూ తీర్మానాన్ని ఆమోదించారు. స్పీకర్ అవధ్ బిహారీ చౌదరిపై అవిశ్వాస తీర్మానంపై ఎన్‌డీఏ ఎన్డీఏ సభ్యులతో పొత్తు పెట్టుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. చౌదరి పదవి నుంచి వైదొలగడంతో డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హాజరయి స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తేజస్వి యాదవ్ నేతృత్వంలోని మహాఘట్బంధన్ శిబిరానికి విశ్వాస ఓటుకు ముందు, ఆర్‌జేడీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు నితీశ్ కూటమిలోకి జంప్ చేశారు. చేతన్ ఆనంద్, నీలమ్ దేవి, ప్రహ్లాద్ యాదవ్ అసెంబ్లీలో ప్రభుత్వ పక్షాన కూర్చొని, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. దీనిపై బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ స్పందిస్తూ... ఓటింగ్ ముగిసే వరకు ఎమ్మెల్యేలు తమ స్థానాల్లో కూర్చోవాలని, లేకుంటే ఓటింగ్ చెల్లుబాటు కాదన్నారు. ఉదయం సీఎం నితీశ్, ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, ఆర్‌జేడీ నాయకుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ రాష్ట్రంలో నెలకొన్న నాటకీయ రాజకీయ పరిణామాల మధ్య అసెంబ్లీకి చేరుకున్నారు. విశ్వాస పరీక్షకు ముందు జరిగిన చర్చల్లో రెండు పక్షాల సభ్యులు పరస్పరం విమర్శల దాడి చేసుకున్నారు. తీర్మానానికి 125 మంది మద్దతు, 112 మంది సభ్యులు వ్యతిరేకించడంతో ఆర్‌జేడీ నేత అవధ్ బిహారీ చౌదరిని బీహార్ అసెంబ్లీ స్పీకర్ పదవి నుంచి తొలగించారు. కాగా, బీహార్ విధానసభ స్పీకర్‌గా బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నంద్ కిషోర్ యాదవ్ నియమితులయ్యారు. యాదవ్ మంగళవారం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీఎం నితీశ్ అసెంబ్లీలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్‌జేడీ తన పాలనలో అవినీతికి పాల్పడిందని, ఎన్‌డీఏ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం దీనిపై విచారణ ప్రారంభిస్తుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ద్వారా ఎన్‌డీఏ సంకీర్ణం బలపడింది. సోమవారం బలపరీక్షకు ముందు 'వేటాడటం' ఆందోళనల మధ్య కాంగ్రెస్ తన ఎమ్మెల్యేలను గత వారం హైదరాబాద్‌కు తరలించగా, ఆర్‌జేడీ ఎమ్మెల్యేలు తేజస్వి యాదవ్ ఇంట్లో కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అలాగే బీజేపీ నాయకుడు నిత్యానంద రాయ్ మొత్తం 78 మంది తమ ఎమ్మెల్యేలను పేర్కొన్నారు. వారిని పాట్నాలోని ఒక హోటల్‌లో ఉన్నారు.

మోదీ, జగన్‌కు గుణపాఠం తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

వెలికితీస్తామని చెప్పిన ప్రధాని మోదీ ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ధ్వజమెత్తారు. ఏపీకి ప్రత్యేక హోదా అమలు చేస్తామని ప్రధాని మోదీ తిరుపతి సభలో ప్రకటిస్తే, ఎవరో చీటీ ఇస్తే చదివారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదమన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీతో దాడులు చేయించడమేకాకుండా న్యాయ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకుని మరోసారి అధికారంలోకి రావాలనే మోదీ ప్రయత్నం చేస్తున్నాడని ఘాటుగా విమర్శించారు. మోదీ ఇచ్చిన హామీ అమలు చేసి ఉంటే నిరుద్యోగులకు ఈ పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు వచ్చి ఉండేవని గుర్తు చేశారు. 2022 లోపు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, అప్పుల బారి నుంచి కాపాడతామని, ఒక్క ఆత్మహత్య కూడా జరగకుండా చూస్తానని హామీ ఇచ్చిన మోదీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమయ్యాడని దుయ్యబట్టారు. బాధిత రైతులు నిరసన తెలిపేందుకు దిల్లీకి పయనమైతే ఆయా రోడ్లలో గుంతలు తవ్వి ట్రాక్టర్లను ఎక్కడికక్కడ నిలిపి వేశారని విమర్శించారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారికి దేశాన్ని తాకట్టు పెడుతున్నాడని అన్నారు. దిల్లీ మద్యం కుంభకోణంలో దిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టించారని, వేల కోట్ల కుంభకోణంలో ముద్దాయిగా 10 సంవత్సరాలుగా బెయిల్‌పై ఉన్న జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు జైలుకు పంపడం లేదని సూటిగా ప్రశ్నించారు. బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలను ఎదుర్కొనేందుకు ఈనెల 20న విజయవాడలో సీపీఐ, సీపీఎం సదస్సు ఏర్పాటు చేశాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని లౌకిక రాజకీయ పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు కలసి రావాలన్నారు. అనంతరం కార్యాచరణ ప్రకటించి ప్రజా ఉద్యమంలో ముందుకు వెళతామని స్పష్టం చేశారు. దేశంలో కొనసాగుతున్న అభివృద్ధి నిరోధక మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఎర్ర జెండా ఎత్తి పోరాటం చేస్తామని, ప్రజలందరూ ఆలోచించాలని రామకృష్ణ కోరారు. రాష్ట్రంలో 10 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, సీఎం జగన్ ప్రతి ఏటా విడుదల చేస్తానన్న జాబ్ క్యాలెండర్ మాటే లేదని విమర్శించారు. రాష్ట్రంలో 40 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గుర్తు చేశారు. కనీసం 23 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జగన్ కేవలం వలంటీర్లపై ఆధారపడి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, రామకృష్ణ, కేశవరెడ్డి, నారాయణ స్వామి, రమణ, సంతోష్ కుమార్, కుల్లాయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అటవీ భూములు పంచాలి

అక్కినేని వనజ డిమాండ్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో అటవీ బంజరు భూములను అర్హులైన గిరిజనులకు పంపిణీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య అధ్యక్షతన అటవీ బంజరు భూముల పంపిణీపై సోమవారం సమావేశం జరిగింది. అనంతరం సీపీఐ కార్యాలయం నుండి స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. రేంజ్ అధికారి ఎస్కే వలికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి వలి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వనసంరక్షణ సమితులు ఏర్పాటు చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అక్కినేని వనజ మీడియాతో మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో గల వందల ఎకరాల అటవీ బంజరు భూములను వన సంరక్షణ సమితులుగా ఏర్పాటు చేసి పేద గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అడవి తల్లిని నమ్ముకున్న గిరిజనులు ఇంకా భూమి లేని నిరుపేదలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా గిరిజనుల తలరాత మారలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, కుకునూరు మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి, వేలేరుపాడు మండల కార్యదర్శి బాడిస రాము, నన్నేపల్లి సాయిబాబు, కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు, బుట్టాయగూడెం మండల కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పిట్టా ప్రసాద్, ఐతా సురేశ్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, అధ్యక్షురాలు వరక శ్యామల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాలయేసు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ చాకిరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాముడి పేరుతో బీజేపీ రాజకీయం

అంతకుముందు సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాముడి పేరుతో రాజకీయం చేస్తున్నదని అక్కినేని వనజ విమర్శించారు. సీపీఐ పట్టణ కార్యాలయంలో మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన సమావేశం జరిగింది. బీజేపీ మత రాజకీయాలతో రాజ్యాంగానికి ముప్పు ఏర్పడుతోందని అక్కినేని వనజ అన్నారు. కుల, మత, రాజకీయ విద్వేషాలు రగిల్చి లౌకికతత్వానికి తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందన్నారు. భౌతికదాడులకు సైతం వెనుకాడటం లేదని నిందించారు. పార్లమెంటులో 143 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసి...ప్రధాని మోదీ నియంతృత్వాన్ని చాటుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సంక్షేమం పేరుతో వైసీపీ, బీజేపీ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో సీఎం జగన్ ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఈనెల16న జరిగే గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు జేవీ రమణరాజు, ఎం.వెంకటాచారి, బాడిస రాము, నన్నేపల్లి సాయిబాబు, జమ్మి శ్రీనివాసరావు, కారం దారయ్య తదితరులు పాల్గొన్నారు.

యాత్ర-2 దర్శకుడికి రెండెకరాల స్థలం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఖండన

విశాలాంధ్ర-విజయవాడ: యాత్ర-2 సినిమా దర్శకుడు మహి వి రాఘవకు జగన్ ప్రభుత్వం ఆంధ్రా ఊటీ హార్స్‌లీ హిల్స్‌లో రెండెకరాల స్థలం కేటాయించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. యాత్ర-2 సినిమాలో నిజాలు మరుగుపరచి తన పాత్రను గొప్పగా చూపించి...జగన్‌కు డబ్బా కొట్టినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం మహి వి రాఘవకు రెండెకరాల స్థలం కేటాయించిందని విమర్శించారు. రాఘవ తనకు అంత ఇష్టమైతే ఇడుపులపాయలో తన సొంత భూములు ఇస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని, కానీ ప్రజల, ప్రభుత్వ ఆస్తిని అప్పనంగా అప్పగించడం సరైందికాదని హితవు పలికారు. క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం గత ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల స్థలంలో మొదటి విడతగా రెండు ఎకరాల స్థలాన్ని రాఘవకు కట్టబెట్టడం వెనుక జగన్ యువజన వ్యతిరేక, కుట్రపూరిత మనస్తత్వం దాగి ఉందని రామకృష్ణ విమర్శించారు. మిగిలిన ఎనిమిది ఎకరాల స్థలాన్ని కూడా అప్పగించేందుకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోందన్నారు. తన స్వప్రయోజనాల కోసం మహి వి రాఘవకు రూ.20 కోట్ల విలువైన ప్రజల ఆస్తిని సీఎం జగన్ పారితోషకంగా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సినీ పరిశ్రమను ముప్పుతిప్పలు పెట్టిన జగన్‌కు మహి వి రాఘవ మాత్రమే సినీ నిర్మాత, దర్శకుడిగా కనిపించారా అని నిలదీశారు. నాలుగున్నరేళ్లలో ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ఎటువంటి నిధులు కేటాయించని జగన్ సర్కార్...యాత్ర సినిమా దర్శకుడికి మాత్రం ప్రభుత్వ భూమి కేటాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే హార్స్‌లీ హిల్స్‌లో రాఘవకు భూ కేటాయింపును రమించుకోవాలని, ఆ భూమిని క్రీడా శిక్షణ కేంద్రం ఏర్పాటు కోసం వినియోగించాలని డిమాండ్ చేశారు.

రైతు, కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

గ్రామీణ బంద్ జయప్రదం చేయండి: రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త అధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య పిలుపునిచ్చారు. చదువుల రామయ్య భవనంలో ఏపీ రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ద ఈరన్న అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ, టీడీపీ, సీపీఎం, లోక్‌సత్తా పార్టీల ప్రతినిధులు, కార్మికసంఘం నాయకులు హాజరయ్యారు. రామచంద్రయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులు హరిస్తూ, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. బ్యాంకులు, ఎల్ఐసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్మికుల హక్కులు కాలరాసేలా 44 కార్మిక చట్టాలను కేవలం 4 కోడ్‌లుగా కుదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస చర్యలు చేపట్టలేదని, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఇవ్వకపోగా, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందని మండిపడ్డారు. భూ హక్కుల చట్టం 27/23ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు అశోక్ కుమార్, లక్ష్మీనారాయణ, సీపీఎం నాయకులు వెంకటేశ్వరరెడ్డి, లోక్‌సత్తా పార్టీ నాయ కులు జయరాం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నబీరసూల్, పత్తికొండ, తుగ్గలి, మద్దికేర మండలాల కార్యదర్శులు డి.రాజా సాహెబ్, సుల్తాన్, నాగరాజు, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, ఉమాపతి, నెట్టి కంటయ్య, పెద్దయ్య, హనుమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్, కార్మిక సమ్మెకు

చేతివృత్తిదారుల సమాఖ్య మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్‌కు, పారిశ్రామిక సమ్మెకు ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల మోదీ పాలనలో రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు, కార్మికులకు, చేతివృత్తిదారుల వ్యతిరేక విధానాలు అమలు చేశారని విమర్శించారు. వ్యవసాయ, కార్మిక రంగాలను అణచివేసిందన్నారు. వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసిందని, నిధులు, పనిదినాలు తగ్గించి ఉపాధిని దెబ్బతీసిందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని విశ్వకర్మ యోజన పథకాన్ని చేతి వృత్తి దారుల సంక్షేమం కోసం అమలు చేస్తామని ప్రకటించి మోసగిస్తుందన్నారు.

దేశ సంపదను దోచిపెడుతున్న మోదీసర్కార్

డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-అమలాపురం: కేంద్రంలోని మోదీ సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసగించిందని... దేశ సంపదను అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ బంద్-పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ జీ రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికవర్గాన్ని అణచివేస్తోందని దుయ్యబట్టారు. స్వామి నాథన్ కమిటీ సిఫార్సుల మేరకు సి2ప్లస్ 50 శాతం ప్రకారం మద్దతు ధరల చట్టం అమలు చేయాలని, రైతుల రుణాలు మాఫీ చేసి కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. కనీస వేతనాన్ని రూ.26 వేలుగా అమలు చేయాలని, ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి 200 రోజుల పనిదినాలు కల్పించాలని కోరారు. వేతనం 600కి పెంచి రెండు పూటలా పని కల్పించి ఆన్‌లైన్ మస్టర్ రద్దు చేయాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సీపీఐ కార్యదర్శి కె సత్తిబాబు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వాసంశెట్టి సత్తిరాజు, ఆటో యూనియన్ నాయకుడు మోకా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి రాము కె రామకృష్ణ, దేవ రాజేంద్రప్రసాద్, ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్ శ్యాముల్, కుంపట్ల వరుణ్ బాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ అడహాక్ కమిటీ

విశాలాంధ్ర-విజయవాడ: గ్రామ వార్డు సచివాలయ (జీఎస్‌డబ్ల్యూఎస్) ఉద్యోగుల జేఏసీ అసోసియేషన్ అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని అడహక్ కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ అడహక్ కమిటీ చైర్మన్‌గా గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజనరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోరాడ మధుబాబు, కో చైర్మన్‌లుగా పంజూరి లీలావతి, గుడి నాగరాజు, రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్‌గా వేముల అశోక్ గౌడ్, డేవిడ్ రాజు, సురేష్ కుమార్, కోశాధికారిగా కొడాలి సునీత, స్నేహలతను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజనరెడ్డి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు రావలసిన ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన అరియర్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్, జూనియర్ అసిస్టెంట్ పే-స్కేల్ ప్రతి శాఖలో ప్రమోషన్లు సాధించడం, అధికారుల వేధింపులను నిలువరించడమే లక్ష్యంగా జేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత మాతృ శాఖల పరిధిలో ఆ శాఖకు సంబంధించిన సచివాలయ ఉద్యోగి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ సంఘాలకు జేఏసీలో ప్రాతినిధ్యం కల్పించి, తదుపరి కార్యచరణను ప్రకటిస్తామని చెప్పారు.

ఆశా కార్యకర్తల వేతనాలు పెంచాలి

విశాలాంధ్ర- విజయవాడ: ఆశా వర్కర్లకు వేతనాలు పెంచి వెంటనే జీవో విడుదల చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ టి.కృష్ణబాబుని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు 55,000 మంది నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. ఆశా కార్మికులు గత 20 సంవత్సరాల నుండి గ్రామాలలో పట్టణాలలో వార్డులలో గర్భిణులు, బాలింతలకు, నవజాత శిశువులకు, మాతా శిశు రక్షణలో ఆరోగ్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన కొత్తలో ఆశా వర్కర్ల జీతం రూ.6,000 నుండి రూ.10,000 పెంచారని గుర్తు చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా పని భారం తీవ్రంగా పెరిగిందని, మార్కెట్‌లో అన్ని రకాల నిత్యావసర సరుకులు, వివిధ రకాల ప్రభుత్వ పన్నులు అన్ని పెరిగినందున ఇప్పుడు ఇస్తున్న రూ. 10వేలు ఏమాత్రం సరిపోవటం లేదన్నారు. ఈ వేతనం తక్షణం పెంపుదల చేసి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు ఏఐటీయూసీ నాయకత్వంలో దాదాపు 15 జిల్లాలలో పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. గత నెలలో రాష్ట్ర సదస్సు నిర్వహించి పెద్ద ఎత్తున జిల్లా కలెక్టర్ల కార్యాలయం ముందు 15 జిల్లాలలో నిరసన తెలపటం జరిగిందన్నారు. కొన్ని జిల్లాలలో ధర్నాలు, ముట్టడి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ముందుగా ఏఐటీయూసీ డిమాండ్ నోటీసు ఇచ్చిన ఫలితంగానే ఇటీవల ప్రభుత్వం ఆశాల సమస్యలు పరిశీలిస్తామని చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య, కడప జిల్లా కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

25న జీవీ పూర్ణచందు పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ సాహితీవేత్త, శతాధిక గ్రంథకర్త, తెలుగు భాషోద్యమ ప్రముఖులు డాక్టర్ జీవీ. పూర్ణచందు 143వ రచన "సొంపైన తెలుగు-అరుదైన మాటల సంచికట్టు" గ్రంథావిష్కరణ సభ ఫిబ్రవరి 25న విజయవాడ ఠాగూరు గ్రంథాలయం లో జరగనుందని నిర్వాహకులు భవిష్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపదచిత్ర రామాయణ కర్త, ప్రముఖ కథారచయిత విహారికి ఈ పుస్తకాన్ని అంకితం ఇచ్చి గురుసత్కారం చేస్తారని పేర్కొన్నారు. సభానంతరం పూర్ణచందు సాహితీ స్వర్ణోత్సవం జరుగుతుందన్నారు. వయో వృద్ధులైన సాహితీ మూర్తులు శుభాశీస్సులందిస్తారని తెలిపారు. దాదాపు 50 ఏళ్లుగా రచయితతో సాన్నిహిత్యం ఉన్న సాహితీ ప్రముఖులు, ఇంకా నేకమంది సాహితీ వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. మండలి బుద్ధప్రసాద్, చిగురుపాటి వరప్రసాద్, దండమూడి సుమతీ రామ మోహనరావు, డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ ప్రభృతులు విచ్చేస్తున్నారు. రచయితలు పెద్ద ఎత్తున ఈ సభలో పాల్గొనవలసిందిగా కోరారు.

అధికారులకు పూర్తిస్థాయి అవగాహన అవశ్యం

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా



విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని, అందుకోసమే ఈ శిక్షణ తరగతులని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. లోక్‌సభ, లోక్‌సభ పరిధిలోని శాసనసభ నియోజకవర్గ ఏఆర్‌వోల తొలివిడత శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక ఏయూ కెమికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో ముఖ్య అతిథిగా విచ్చేసిన ముకేశ్ కుమార్ మీనా... జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనీ సమీర్ అహ్మద్ జాన్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునలతో కలిసి జ్యోతి వెలిగించి శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలు, ఓటర్ల జాబితా, ఎన్నికల అధికారులు ప్రధానమని, ఈ ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆర్‌వోలతో పాటు ఏఆర్‌వోలు కీలకమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా జారీచేసిన మార్గదర్శకాలు, సూచనలను పాటిస్తూ ముందుకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో 1,000 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. తొలి విడత శిక్షణను విశాఖ, విజయవాడ, తిరుపతిలో ప్రారంభించామనీ, ఈ నెలాఖరులోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తికానున్నట్లు వివరించారు. జాతీయస్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణలో ఎన్నికల ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకొని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారుచేసినట్లు చెప్పారు. ఈవీఎంలు, ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉన్నారని వివరించారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, విశాఖ, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల జేసీలు, ఏఆంవోలు హాజరయ్యారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వండి

ప్రధానికి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు మార్గం చూపిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇచ్చేందుకు ప్రధాని చొరవ చూపాలని పద్మ భూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. భరతమాత ముద్దుబిడ్డలు పీవీ నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, డాక్టర్ ఎంఎస్ స్వామి నాథన్‌లకు మరణానంతరం భారతరత్న ప్రదా నం చేసిన నేపథ్యంలో ఎన్టీ రామారావును కూడా అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్నతో గౌరవించాలని యార్లగడ్డ విన్నవిం చారు. ఈ మేరకు ప్రధానికి ఆయన సోమ వారం లేఖ రాశారు. నటుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ భారతీయ సంస్కృతి పరిరక్షణలో కీలకభూమిక పోషించారని తెలిపారు. సంక్షేమ రాజ్యం, పరిపాలనా సంస్కరణలు, మహిళా సాధికారత, జాతీయ రాజకీయాలు, ప్రజాజీవితం తదితర విభిన్న అంశాలలో ఎన్టీఆర్ కృషి అజరామరమని వివరించారు. ఎన్టీ రామారావు 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారా దేశంలో 'ప్రత్యామ్నాయ రాజకీయాలకు' పెద్దపీట వేశారన్నారు. 1989లో కేంద్రంలో రెండవ కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటులో ఆయన ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. అన్ని విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఎన్టీ రామారావుకు భారతరత్న ప్రదానం చేయాలని లేఖలో ప్రధానిని కోరారు.

తెలుగు తమ్ముళ్లలో వర్గపోరు

తలలు పట్టుకుంటున్న కార్యకర్తలు

లోకేశ్ 'శంఖారావం'తో తీరు మారేనా?

విశాలాంధ్ర, విజయనగరం: ఉత్తరాంధ్ర జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎన్నికల "శంఖారావం" కార్యక్రమం కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయడంతో పాటు పార్టీలోని అంతర్గత వ్యవహారాలను కూడా చక్కదిద్దేందుకు వేదికగా నిలుస్తుందని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఈ నెల 14 నుంచి 16 వరకు ఆయన పర్యటించనున్నారు పలు నియోజక వర్గాలలో టీడీపీ నేతలు రెండేసి వర్గాలుగా విడిపోయి పనిచేయడంతో ఎవరితో సఖ్యతగా వుంటే ఏం ముప్పు వస్తుందోనని కార్యకర్తలు తలలు పట్టుకుం టున్నారు. లోకేశ్ తన పర్యటనలో నియోజకవర్గాల్లో గ్రూప్ రాజకీయాలకు చెక్ పెడతారని కార్యకర్తలు ఆశిస్తున్నారు. గ్రూపుల వ్యవహారం ఇటు కార్యకర్తలకు, అటు నాయకత్వానికి తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి. బొబ్బిలి, చీపురుపల్లి నియోజక వర్గాలు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలు పార్టీకి ఇబ్బందిగా మారాయి. కొన్ని చోట్ల అధిష్ఠానం కావాలనే సీనియర్లను పక్కన పెట్టి కొత్త వారిని ప్రోత్సహిస్తోందనే అపప్రద కూడా ఉంది.

గజపతినగరంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.ఎ. నాయుడుతో పాటు కరణం శివరామకృష్ణ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వీరిద్దరూ కలిసి పనిచేయాలనే అధిష్ఠానం ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాలేదనే మాట వినిపిస్తోంది. ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత కోళ్ల లలిత కుమారి, గొంప కృష్ణ రెండు గ్రూపులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టికెట్ తమదంటే తమదేనని రెండు వర్గాలూ బహిరంగంగా చెప్పుకుంటున్నా, అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠగా వున్నాయి. విజయనగరం నియోజక వర్గంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు బరిలో వుంటారా? ఆయన కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేస్తారా అనేది స్పష్టత రాలేదు. ఆమె మాత్రం చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

మరోవైపు మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, అశోక్ బంగ్లాకు మాత్రం ఆమె దూరంగానే ఉన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సీనియర్ నేత, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, కర్రోతు బంగార్రాజు వర్గం పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బంగార్రాజు కూడా చురుగ్గా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ తనకు టికెట్ కేటాయిస్తారని ఆశిస్తున్నారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా జనసేనకు చెందిన లోకం మాధవి కూడా నెల్లిమర్ల టికెట్ ఆశిస్తున్నారు. దీంతో ఇక్కడ టీడీపీ, జనసేన అభ్యర్థుల్లో ఎవరికి టికెట్ ఖరారవుతుందనే ఉత్కంఠ నెలకొంది. రాజాంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోండ్రు మురళి పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాజీ స్పీకర్ ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ కూడా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో ఒకటి రెండు నియోజక వర్గాలు మినహా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఆశావహులు ఎక్కువగా ఉండడంతో పాటు గ్రూపు రాజకీయాలు కూడా పార్టీపై ప్రభావం చూపుతున్నాయి. ఆశావహులెక్కువగా వున్న చోట టికెట్ రాని వర్గం తమ అభ్యర్థి విజయం కోసం కలిసి పనిచేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ నేపథ్యంలో లోకేశ్ పర్యటన పార్టీకి అంతర్గతంగా కూడా కీలకమే. స్థానిక నేతలకు ఆయన దిశా నిర్దేశం చేసే అవకాశం ఉందని క్షేత్ర స్థాయి నేతలు, కార్యకర్తలు భావిస్తున్నారు.

సంపాదకీయం

పల్టూ రాం పదిలం

ఒకే శాసనసభా కాలంలో మూడుసార్లు తానున్న ఐక్య సంఘటన నుంచి మరో కూటమిలో చేరిన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సోమవారం విశ్వాస పరీక్షలో నెగ్గారు. 243 స్థానాలుగల శాసనసభలో బీజేపీ మద్దతుతో తొమ్మిదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకరించిన నితీశ్ సర్కారుకు అనుకూలంగా 130 మంది మద్దతు లభించింది. ఇందులో ఆఖరి నిముషంలో నితీశ్ పంచన చేరిన ముగ్గురు రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) సభ్యులూ ఉన్నారు. నితీశ్ ప్రవేశపెట్టిన విశ్వాస పరీక్షపై చర్చ పూర్తి అయిన తరవాత ఆర్.జె.డి. నాయకుడు తేజస్వీ యాదవ్ నాయకత్వంలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. అందువల్ల నితీశ్‌కు వ్యతిరేకంగా ఒక్క ఓటూ పడలేదు. ప్రతిపక్షం లేనప్పుడు అధికార పక్షానిదే విజయం కావడంలో ఆశ్చర్యంలేదు. సోషలిస్టు సిద్ధాంత మూలాలున్న నితీశ్ కుమార్ ఎప్పుడు ఏ కూటమిలో ఉంటారో, మరెప్పుడు ప్రత్యర్థి కూటమిలో చేరతారో చెప్పడం కష్టమే. అందుకే ఆయనను పల్టూ రాం(ఫిరాయింపుదారు) అంటారు. తాను సూత్రధారిగా ఉండి నిర్మించిన ప్రతిపక్ష "ఇండియా" కూటమి చురుకుగా లేకపోవడం ఆయనకు నచ్చలేదంటున్నారు. అలాగే ఒకవేళ "ఇండియా" ఐక్య సంఘటన 2024 సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధిస్తే ఆయన ప్రధానమంత్రి అభ్యర్థి కావడానికి "ఇండియా" లోని కొన్ని పక్షాలు సమ్మతించకపోవడం, ఆయనను ఈ ఐక్య సంఘటనకు కనీసం సమన్వయకర్తను చేయకపోవడం నితీశ్‌కు నిరాశ కలిగించిందన్న వాదనలున్నాయి. ఇవన్నీ నిజమే అనుకున్నా సుదీర్ఘ అనుభవం ఉన్న నితీశ్ లాంటి వ్యక్తి, "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటుకు కృషి చేసిన వ్యక్తే దాన్ని వీడిపోయారంటే ఆయనలో గూడుకట్టుకున్న పదవీకాంక్షే కారణం అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రధానమంత్రి పదవి ఎటూ రాదు కనక ఉన్న ముఖ్యమంత్రి పదవినైనా కాపాడుకోవడం మేలనుకుని మొన్నటిదాకా తిట్టి పోసిన బీజేపీతో మిలాఖతై పోవడం రాజకీయాల్లో అనైతికతకు పరాకాష్ఠ. కొద్ది రోజుల కింద నితీశ్ దిల్లీ వెళ్లి బీజేపీ అధినాయకుడు, ప్రధానమంత్రి మోదీ దర్శనం చేసుకోవడమే కాక "మళ్లీ ఎప్పుడూ ఎన్.డి.ఎ. వదిలి వెళ్లను" అని వాగ్దానం కూడా చేసి వచ్చారు. అయితే నితీశ్ వాగ్దానాలను నమ్మడం కష్టమే. ఇప్పుడైనా ఆయన మళ్లీ కూటమి మార్చరన్న హామీ లేదు. ఆర్.జె.డి. నాయకుడు తేజస్వీ యాదవ్ ఇదే మాట అన్నారు. నితీశ్ కుమార్ కొద్ది రోజులుగా ఊగిసలాట ధోరణిలో ఉన్నప్పుడే ఆయన బీజేపీతో వియ్యమందుతారన్న గుసగుసలు వినిపించాయి. చివరకు అదే మాట నిజమైంది. ఆర్.జె.డి.తో తెగతెంపులు చేసుకుని రాజీనామా సమర్పించి రాజ్‌భవన్ నుంచి బయటకు వచ్చి "నాకైతే సంతోషంగా లేదు" అన్నారు. ఆయన దృష్టిలో పదవీకాంక్ష తప్ప ఆనందం కలిగించే అంశం మరేదైనా ఉంటుందంటే ఎలా నమ్ముతాం. బీజేపీతో మైత్రి కంటే మరణమే మేలు అన్న మనిషే బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు కదా! "ఇండియా" కూటమిలో కనిపిస్తున్న బలహీనత మాత్రమే నితీశ్ ఫిరాయించడానికి కారణం అయి ఉండదు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తాము ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించడంతో నితీశ్‌కు "ఇండియా" మీద నమ్మకం సడలిందనడం సాకు మాత్రమే. "ఇండియా" ఐక్య సంఘటన విజయం సాధిస్తే మల్లికార్జున్ ఖడ్గే ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉండాలని మమతా బెనర్జీ అనడమే నితీశ్‌కు సమ్మెట పోటుగా మారి ఉంటుంది. అదీ కాక మమత, కేజ్రీవాల్ మొదలైన వారిని సంప్రదించిన తరవాత "ఇండియా" ఐక్య సంఘటన సమన్వయకర్త ఎవరో తేలుస్తామని చెప్పడం కూడా నితీశ్ ఆఖరి ఆశ మీద కూడా నీళ్లు చల్లినట్టు అయింది. ఎటూ రాని పదవుల మీద ఆశ పెంచుకోవడం కన్నా సిగ్గు విడిచి బీజేపీతో కలిసి ముఖ్యమంత్రి పదవి కాపాడుకోవడం మేలని నితీశ్ అనుకున్నట్టున్నారు. ఈ పదవీ లాలసత ఆయన మీద ఉన్న గౌరవాన్ని, పరిణత నాయకుడన్న నమ్మకాన్ని, రాజకీయ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారన్న ఆశని ఒక్క దెబ్బతో చిదిమేసింది. పోనీ కర్పూరీ ఠాకూర్‌కు భారత్ రత్న ఇచ్చినందుకు కృతజ్ఞతగా బీజేపీ పంచన చేరారనుకుందామన్నా కర్పూరీ ఠాకూర్ మీద ఆయనకు గౌరవాదరాలే ఉంటే ఆయన విధానాలను అనుసరించాలి. ఆయన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలి. ఇవేవీ లేనప్పుడు పదవీ లాలన తప్ప మరో కారణం ఏముంటుంది?

బీహార్‌లో కులగణన జరిపించి అనేక మంది మన్ననలు పొందిన నితీశ్ కులగణనకు బద్ధ విరోధి అయిన బీజేపీతో చేరి ఆ సైద్ధాంతిక వాదానికీ తానే గండి కొట్టినట్టయింది. కుల గణనకు వ్యతిరేకంగా బీజేపీ కోర్టుకెక్కిన వాస్తవాన్ని ఆయన విస్మరించడాన్ని కక్కుర్తి అన్న మాటతో తప్ప వివరించడం సాధ్యం కాదు. ఇప్పుడు ఆయన కులగణన గురించి మాట్లాడ గలరా? సోమవారం విశ్వాస ప్రకటనా తీర్మానం మీద చర్చ సందర్భంగా నితీశ్ ప్రసంగం ఆయన నైతిక పతనానికి పరమావధిగా నిలుస్తుంది. ఆర్.జె.డి.తో కలిసి అధికారం అనుభవించిన తరవాత ఆయనకు ఆర్.జె.డి. ది జంగల్ రాజ్ అని గుర్తొచ్చింది. నిజానికి ఈ మాటనూ ఆయన బీజేపీ నుంచే అరువు తెచ్చుకున్నారు. విశ్వాస ప్రకటనా తీర్మానంపై జరిగిన చర్చలో తేజస్వీ యాదవ్ ప్రసంగంలో కనిపించిన పరిణతి నితీశ్ ఇచ్చిన సమాధానంలో లేశ మాత్రం కూడా లేదు. "నితీశ్ గౌరవనీయుడు. ఆయన అంటే మాకు ఆదరం. అది ముందూ ఉంది. ఇప్పుడూ ఉంది. ఇక ముందూ ఉంటుంది" అని తేజస్వీ తన రాజకీయ పరిణతి ప్రదర్శించారు. భవిష్యత్తులో తేజస్వీ మేటి రాజకీయ నాయకుడిగా ఎదగగలరన్న విశ్వాసం కలుగుతోంది. అడ్డదారులు తొక్కి నితీశ్ మళ్లీ ముఖ్యమంత్రి కాకుండా చేయడం తేజస్వీకి వల్లమాలిన పనేం కాదు. కానీ నితీశ్ పల్టీ కొడతారు అని తెలిసినప్పటి నుంచి తేజస్వీ యాదవ్ చాలా సంయమంతో వ్యవహరించారు. విశ్వాస ప్రకటన తీర్మానంలో తమ వర్గం ఓడిపోతుందని తేజస్వీకి తెలియక కాదు. కానీ ఆయన కప్పదాటు వేయదలచుకోలేదు. బీజేపీతో కత్తు కలవని పార్టీ కాంగ్రెస్‌ను మినహాయిస్తే ఆర్.జె.డి. ఒక్కటే. అవసరార్థం కాంగ్రెస్ హిందుత్వ అనుకూల ధోరణి అనుసరించిన సందర్భాలున్నాయి కానీ లాలూ హయాంలో కానీ, ప్రస్తుతం తేజస్వీ నాయకత్వంలో కానీ ఆర్.జె.డి. ఎన్నడూ బీజేపీని, హిందుత్వ రాజకీయాలను సమర్థించలేదు. సెక్యులర్ లక్షణానికి నిరంతరం కట్టుబడి ఉంది. అసలు ఆర్.జె.డి.తో ఉన్న ఇబ్బంది ఏమిటో నితీశ్ ఇప్పటిదాకా వెల్లడించలేదు. నితీశ్ కొత్త నాటకం మొదలు పెట్టిన తరవాత తేజస్వీ ఒక్క సారి కూడా నోరు జారలేదు. తేజస్వీ ఓడిగెలిచారు.

కనికట్టు

చింతపట్ల సుదర్శన్

హోయ్! డాంకీ హౌ ఆర్ యూ! అన్నమాటలు వింటూ అరుగు ఎక్కింది డాంకీ. గోడచాటు నుంచి ఎవరు మాట్లాడుతున్నారో తెలీలేదు కానీ ఎంత వినయంగా, ఎంత స్వీటుగా మాట్లాడుతున్నారు అనుకుని, ఎవరు మాట్లాడేది? అన్నది డాంకీ, గోడకు ఆనుకుని కూచుంటూ. ఎవరైతేనేమిలే నేను మీ శ్రేయోభిలాషిని, మిత్రుడ్ని కూడా అంటూ గోడచాటు నుంచి బైటకు వచ్చింది డాగీ. నువ్వా? నువ్వేనా? ఇంత స్వీటుగా మాట్లాడుతున్నావు అని ఆశ్చర్యం ప్రకటించింది డాంకీ. ఎప్పుడుచూసినా "భౌ భౌ" మని అలుపులేకుండా అరిచే ఈ వీధికుక్క ఇంత 'పొలైట్'గా 'సాఫ్ట్'గా మాట్లాడుతున్నదని అనుకుంటున్నావు నాకు తెల్సు. కానీ దిక్కూ దివాణం ఆశ్రయంలేని, అడిగేవాడూ, పట్టించుకునే వాడులేని వీధికుక్కలం కదా. అనువుగాని చోట అధికులం కాకూడదని, ఇకనించి అందరితో మర్యాదగా, తీయగా, ఆప్యాయంగా మాట్లాడాలని నిశ్చయించుకున్నాం. వీధి కుక్కల్లో ఈ

రంగస్థలం

మార్పు ఎందుకు వచ్చిందో ఎలాగ వచ్చిందో తెల్సుకోవచ్చునా అన్నది డాంకీ. తప్పకుండా! ఈ మధ్య ఒక 'పెట్ డాగ్స్ ఆర్గనైజేషన్' వారు చేసిన సర్వే ప్రకారం దేశంలో ఆరుకోట్లకుపైగా వీధి కుక్కలు, ఎనభైలక్షల గోడమీది పిల్లులు ఉన్నవట. ఈ అంకెలను లెక్కలోకి తీసుకుంటే మన తెలుగు రాష్ట్రాల్లో ఏభై లక్షల కుక్కలున్నా ఉండి ఉంటవి. పల్లెలలోనూ, పట్నాలలోనూ సుమారుగా లెక్కించితే, మన ఈ సిటీలో ఓ ఐదు లక్షల కుక్కలైనా ఉండి ఉంటాయి. ఆ అయిదు లక్షల్లో మన ఇలాఖాలో కనీసం యాభై కుక్కలుంటే, మన బస్తీలో పది కుక్కలున్నాయి. ఆ పదింటిలో నేనో వీధికుక్కని. నేనెంత? నా స్థాయి ఎంత ఉండటానికి ఇల్లుందా, పండుకోను పరుపు ఉందా, ఆడుకోను బంతి ఉందా, వాకింగ్‌కు తీసుకు వెళ్లే పనివాడున్నాడా? 'మై స్వీట్ టామీ కం హియర్' అని పలకరించే యజమాని కలడా? అందువల్ల, అందుచేత ఇప్పటినుంచి అందరితోనూ మంచిగా మసలుకోవాలని నిర్ణయించుకున్నా. నా మాటల్లో ఏదైనా పొరపాటుగాని, తప్పుగాని దొర్లుంటే నన్ను క్షమించవా మై డియర్ డాంకీ అంది డాగీ. మాటా, పలుకూ లేకుండా నోరు తెర్చుకుని పెద్ద కనుగుడ్లేసుకుని అలాచూస్తూ ఉండిపోయిన డాంకీ 'షాక్' నుంచి తేరుకుని నిన్ను చూస్తుంటే పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టే ఆర్థికమంత్రులు గుర్తుకొస్తున్నారు. ఆహా! ఆ అంకెలు చెప్పిన విధానం ఒక ఆర్థిక నిపుణుడు అంకెలు వల్లించే తీరును గుర్తుచేస్తున్నది అన్నది డాంకీ, ఆ! అవో అంకెలు నేనో లెక్కల మేస్టరునీ, ఏదో విన్నది చెప్పాలనిపించి చెప్పానంతే. ఇప్పుడు నాకు విషయం పూర్తిగా అర్థమైంది. నువ్వింత తియ్యగా మాట్లాడటానికి కారణం తెల్సింది. బడ్జెట్ ప్రవేశపెట్టటానికి ముందు తయారుచేసిన తియ్యని 'హల్వా' తిని ఉంటావు కాదా అంది డాంకీ. ప్రీ బడ్జెట్ హల్వా సంగతి తెల్సుకానీ, నేనేం తినలేదు. వాళ్లు వాళ్లు పంచుకునేది, ప్రతిపక్షాలకు, నాలాంటి వీధి కుక్కలకూ పెడ్తారా ఏంటి. తియ్యంగా మాటాడ్డమే కాదు, ఏహోహో అంకెలు చెప్పావుకదా. అందరికీ హల్వాతో మస్కాకొట్టి, ఆ తర్వాత బడ్జెట్‌లో చేసేది అంకెల గారడీయే కదా! కొట్టుకునేది సొంత డబ్బానేకదా! అవును మరి హల్వా తినడానికే కాని పంచడానికి కాదు. అంకెలుచెప్పి గందరగోళంగో పడెయ్యడానికేకాని, సీసా కొత్తది సారా పాతదే! అనేది నిత్యసత్యం కదా. అసలుపైకి గాయాలు కనిపించకుండా బాదే పోలీసోడి దెబ్బకూ, బడ్జెట్లకూ అవినాభావ సంబంధం ఉండుననేది జగమెరిగిన సత్యమే కదా అంది డాగీ. ఓ డాగీ, ఓ డాంకీ, ఈ కూలిన కొంప అరుగుమీద నిత్యశోధన చేస్తున్నావన్నమాట అంటూ అరుగుఎక్కాడు అబ్బాయి. బడ్జెట్‌కు ముందు తయారయే హల్వా దేశంలో జనానికి పంచితే బాగుండేది అన్నది డాంకీ, బడ్జెట్లో అన్నీ ఉన్నాయనిపిస్తయి కానీ ఏమీ ఉండవు. లేనివి ఉన్నట్లు కనిపించేట్టు చేసేదాన్నే 'కనికట్టు' అంటారు. పన్నులూ, ధరలూ తగ్గించటం ఎంత హల్వా తిన్నవారికే సాధ్యంకాదు. మార్కెట్లో వెల్లుల్లి ధర కేజీ ఐదువందలట, ఇప్పుడే అడిగి వస్తున్నా అన్నాడబ్బాయి. బడ్జెట్ గురించి జనం ఆలోచించడం మొదలు పెట్టకముందే, సర్కారువారి 'కాకరకాయ' రుచి తెల్సిరాకముందే మసిపూసి మారేడు కాయ చేశారుగా అంది డాంకీ. నువ్వన్నది నాకు అర్థంకాలేదు అంది డాగీ. నా కర్థమైంది. ఎప్పటికప్పుడు ప్రజల్ని దారితప్పించి మభ్యపెట్టడానికి శతకోటి ఉపాయాలుంటాయి. వాటిల్లో ఒకటి ప్రయోగింపబడింది. గడిచిన ఏడేళ్లలో దేశంలో అత్యున్నత పురస్కారం ఎవరికీ ఇవ్వనివారు, ఇప్పుడు ఏకంగా, ఎంతో ఉదారంగా 'తన, పర' భేదం లేకుండా ఐదుగురికి పంచి పెట్టేశారు. తెలుగువాళ్లనీ, తమిళులనీ, రైతుల్నీ, రామభక్తుల్నీ సంతృప్తిపరచి, హరిత విప్లవానికి పెద్దపీట వేశారు. ఎన్నికల ముందు ఎవరికి ఏ ఎరవేయాలో, ఏలినవారికి తెల్సిన విద్యేకదా అన్నాడు అబ్బాయి అరుగు దిగిపోతూ. ఎన్నికల్లో గెలవాలంటే భక్తి మార్గమొక్కటే చాలదు గజకర్ణ, గోకర్ణ, టక్కుటమార విద్యలన్నీ తెలుసుండాలి అంది డాంకీ. నాకు మాత్రం క్షుద్రవిద్యలూ తెలియవు. నిజంగానే తీయగా, మర్యాదగా మాట్లాడాలని, అనవసరంగా అరవరాదని నిర్ణయించుకున్నా అంది డాగీ.

రైతులపై ప్రభావం చూపని భారతరత్న

సుశీల్ కుట్టి

రైతు నాయకుడు, మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కి 'భారత రత్న' ప్రకటించినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీకి పెద్దగా ఉపయోగ పడే సూచనలు కనిపించడంలేదు. రానున్న కొద్దిరోజుల్లో లక్షలాది మంది రైతులు మళ్లీ మోదీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ పోరాటానికి సిద్ధమయ్యారు. మళ్లీ దిల్లీని చుట్టముట్టేందుకు లక్షలాది మంది రైతులు బయల్దేరుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రైతులు గతంలో వలే పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. అంతర్జాతీయ మీడియా రైతులు సన్నద్ధమైన అంశాలను ప్రముఖంగా రాస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో లబ్ధిపొందేలక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఐదుగురు ప్రముఖులకు భారత రత్న ప్రకటించారు. తాత్కాలిక ఎత్తుగడలను మోదీ ప్రయోగించినప్పటికీ, పెద్దగా ఫలితం ఉండబోదని అంతర్జా తీయ మీడియా చెబుతోంది. చరణ్‌సింగ్‌కి భారతరత్న ప్రకటించడం వల్ల జయంత్ చౌదరి కుటుంబం సంతోషించవచ్చు. అయితే ఈ నిర్ణయం రైతులపై ఏమాత్రం ప్రభావం చూపలేక పోయింది. రైతులందరికీ పెద్దసమస్యగా ఉన్న పంటకు కనీస మద్దతుధరపై ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇంకా నెరవేర్చకపోవడంపై ఆందోళనకు రైతన్న సన్నద్ధమౌతున్నాడు. పోలీసులను సైతం లెక్కచేయకుండా ట్రాక్టర్ల ప్రదర్శనతో పోరాటానికి రైతులు సిద్ధ మయ్యారు. ట్రాక్టర్ల ద్వారానే ఆందోళన ప్రారంభించనున్నారు. గతంలో మోదీ తీసుకున్న నిర్ణయాన్ని రైతులు అనుభవించారు. సమూహాలుగా రైతులు పంజాబ్, హరియాణా ఇతర ప్రాంతాల నుంచి దిల్లీకి బయల్దేరారు. అనేక పదులు, వేల మంది రైతులతో ట్రాక్టర్లు దేశ రాజధాని దిల్లీకి బారులుతీరాయి. దాదాపు రెండేళ్ల క్రితం ఉద్యమం జరిగింది. దిల్లీని చుట్టుముట్టి రైతులు మహత్తర పోరాటం చేశారు. అయితే అప్పుడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఓట్ల కోసం మూడు వ్యవసాయ దుష్ట చట్టాలను మరో మార్గంలేక మోదీ ఉపసంహరించుకున్నారు.

మోదీ ఆనాడు రైతులపై కక్ష తీర్చుకున్నట్లుగా రైతులతో కనీసం స్వయంగా చర్చలు కూడా జరపలేదు. ఒక నియంతృత్వ ప్రభుత్వాన్ని నడిపినట్లుగా నడిపారు. మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రైతు నేతలను ఏ మాత్రం పట్టించుకోలేదు. నల్ల చట్టాల మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలుసుకున్నారు. ట్రాక్టర్లను దిల్లీనగరంలోనికి నడిపించి తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. చట్టాలను ఉపసంహరించుకున్నారేగానీ, పూర్తిగా రద్దుచేయలేదు. దిల్లీని దిగ్బంధం చేసినప్పుడు అంతర్జాతీయ రైతులు సైతం తమ మద్దతు ప్రకటించారు. దాదాపు 500రైతు సంఘాలు కలిసి సంయుక్త మోర్చాను ఏర్పాటుచేసి ఉద్యమాన్ని నిర్వహించాయి. సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు రాకేష్ తికాయత్ రైతులను ఒకతాటిపై నడిపించారు. మంగళవారం జరగనున్న దిల్లీ చలో మార్చ్‌ను వాయిదావేయించేందుకు కొంతమంది కేంద్ర మంత్రులు చర్చలు జరిపినప్పటికీ ఉద్యమకారులు వెనుకపట్టు పట్టలేదు.

పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధంగా హామీ ఇవ్వాలనేది ప్రధాన డిమాండ్. గతంలోఉన్న ఈ డిమాండ్ నెరవేరుస్తామని ఆనాడు వాగ్దానం చేశారు. అలాగే విద్యుత్తు బిల్లును ఉపసంహరించుకుంటామని ఇచ్చిన హామీని ఇంతవరకు పట్టించుకోలేదు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కూడా రైతు నాయకులతో మాట్లాడారు. అయితే దుష్టచట్టాలను ఉపసంహరించు కున్న తర్వాతనే రైతులు ఉద్యమాన్ని విరమించుకున్నారు. ఈ పోరాటం సందర్భంగా దాదాపు 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు సుదీర్ఘకాలం మౌనం వహించింది. మరణించిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించటం ఇప్పటికీ పూర్తికాలేదు. కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా రైతుల సమస్యలపై మళ్లీ చర్చిస్తామని ప్రకటించినప్పటికీ, రైతులు నమ్మే స్థితిలే లేరు. పంటకు కనీస మద్దతు ధరకు హామీ ఇస్తానని ప్రధాని మోదీ ప్రకటించినప్పటికీ రైతులు నమ్మలేదు. అందువల్లనే పోరాటానికి సిద్ధమయ్యారు. హరియాణా, దిల్లీ ప్రాంతాలలో రైతులను ముందుకు రాకుండా అడ్డంకులు కల్పించారు. ఉద్యమాన్ని పురస్కరించుకుని భారీగా పోలీసులను నియమించారు. రహదారులవెంట కాంక్రీటు దిమ్మలను అడ్డంపెట్టి రైతు ట్రాక్టర్లను నడిపించేందుకు వీలులేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. 144వ సెక్షన్‌ను ప్రకటించారు. వాస్తవంగా, హరియాణాలో రైతులు ఒకరకమైన యుద్ధానికి సిద్ధమయ్యారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించినప్పటికీ రైతుల డిమాండ్‌లో ఏమాత్రం మార్పులేదు. ఒత్తిడి చేసినంత మాత్రాన మోదీ డిమాండ్‌లు ఏమాత్రం అంగీకరించేట్లుగా లేరు. ఈ సమయంలో రైతులు ఉద్యమాన్ని విరమించుకుంటే మోదీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచే అవకాశం ఉంటుందని ఉద్యమకారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, ఎన్‌డీఏలను తప్పనిసరిగా ఓడించాలని రైతులు గట్టి నిర్ణయం తీసుకున్నారు. రామమయం నినాదంతో వీధుల్లో కల్లోలం సృష్టించ వచ్చు. అయినప్పటికీ రైతులు డిమాండ్‌లు సాధించుకు తీరాలని పట్టుబట్టారు. సీఏఏను అమలుచేయాలని నిర్ణయించారు. సీఏఏను ఉపసంహరించుకోవాలని గతంలో కంటే నేడు రెట్టింపు ఉత్సాహంతో షాహీన్‌బాగ్ లాంటి పోరాటాన్ని నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలోను, ఉత్తరాఖండ్‌లో హల్ద్వాని లోనూ సీఏఏ అమలుకోసం ప్రయత్నించనున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సీఏఏను తప్పనిసరిగా అమలు చేస్తానని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. మతాల మధ్య చిచ్చుబెట్టి ఓట్లు పొందాలని ప్రయత్నిస్తున్నారు. ఈ అంశంపై గతంలో చేసిన ఉద్యమంకంటే మరింత ఉధృతంగా ఉద్యమం జరిగే అవకాశం ఉంది. సీఏఏ అమలు ప్రారంభమైతే ప్రతికూలచర్య కూడా వెంటనే ప్రారంభమవుతుంది.

రామమందిరం ప్రారంభం మాత్రమే ఓట్లు ఎవరికి, ఏ పార్టీకి వేస్తారనేది నిర్ణయం జరగదు. పంజాబ్, హరియాణా రైతులు రామమందిరం అంశం చూసిఓట్లు వేయరు. అలాగే చరణ్‌సింగ్‌కి భారతరత్న ప్రకటించడం వల్లనే బీజేపీకి ఓట్లురావడం కష్టం. రైతుల ఉద్యమానికి కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ మద్దతు ప్రకటించారు. రైతులు దిల్లీకి రాకుండా నివారించేందుకు రోడ్ల మీద పెద్దపెద్ద మేకులను దిగగొట్టి ఆటంకం కలిగిస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రైతుల డిమాండ్లు ప్రధానమైన ప్రచారాస్త్రం అవుతుందని రాహుల్‌తోపాటు ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.

ఉరుముతున్న నిరుద్యోగం... యువతకు దారేదీ...

పతకమూరు దామోదర్ ప్రసాద్

ప్రపంచంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా ఎదుగుతున్నా ఉరుముతున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలం కాలేక పోతున్నాయి. 2047నాటికి దేశానికి స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తవుతాయి. స్వతంత్ర భారతం అనేక రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించినా భారత్‌లో తయారీవంటి ఆకర్షణీయ నినాదాలిస్తున్నా తదనుగుణంగా ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో ముఖ్యంగా తయారీ రంగంలో మేటిగా నిలవలేక ఇంకా అనేక వస్తువులను చైనా తదితర దేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఫలితంగా కోట్లాది మందికి ఉద్యోగ ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రస్తుతం 5వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను వచ్చే 24ఏళ్లలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ప్రపంచంలో మూడవ స్థానానికి చేర్చడమే లక్ష్యంగా సంకల్పం చెప్పుకుని ఆ దిశగా కొన్ని చర్యలు చేపట్టారు. అయితే ఇవి లక్ష్యసాధనకు ఏమేరకు ఉపకరిస్తాయ నేదే ప్రశ్న. నిరుద్యోగ సమస్య తీవ్రత దృష్ట్యా పలస్తీనా వివాదంలో ఇస్లామిక్ దేశాలతో పోరాడుతున్న ఇజ్రాయిల్ దేశంలో వివిధ రంగాలలో ముఖ్యంగా నిర్మాణరంగంలో పనిచేయడానికి భారత యువత ఎగబడటం చూస్తే నిరుద్యోగ పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. ఇజ్రాయిల్ నిర్మాణరంగంలో పనిచేయడానికి 10వేలమందికి పైగా ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్‌లు, కార్పెంటర్‌లు, పెయింటర్ల వంటి వివిధ వృత్తులవారు అవసరం కాగా ఆ పనుల్లో చేరడానికి తొలుత 25కోట్ల జనాభా గల అతి పెద్ద రాష్ట్రం యూపీ, హరియాణా యువకులు ఎగబడ్డారు. కాగా ఇజ్రాయిల్‌తో స్నేహసుహృద్భావ సంబంధాలు నెరపుతున్న నరేంద్ర మోదీ ప్రభుత్వం చొరవ తీసుకుని బీజేపీ ఏలుబడిలోని యూపీ, హరియాణాలో కార్మికుల నియామకంలో ఇజ్రాయిల్‌కు తమ సహకారాన్ని అందించింది. పలస్తీనా సంఘర్షణలో ఇస్లామిక్ దేశాలు, ఇజ్రాయిల్ పరస్పరం బాంబు, క్షిపణిదాడులకు దిగడంతో అక్కడ ప్రాణాంతకమైన భీతావహ పరిస్థితుల్లో సైతం పనిచేయడానికి మన నిరుద్యోగ యువత పోటీపడుతున్నది. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.1.40లక్షల జీతం, రూ 4వేల వరకు బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఎంపిక జరుగుతున్న చోట్ల తొక్కిసలాట జరుగుతున్నది. ఆకలితో మరణించడం కంటే పనిచేస్తూ ప్రాణాలు పోగొట్టుకోవడానికి యువత సిద్ధపడటం నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనం. వివిధ దేశాలలో నైపుణ్యం, పాక్షిక నైపుణ్యం గల కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండటంతో జీవనం కోసం ఆదేశాలకు తరలి వెళ్లడానికి యువత పోటీ పడుతున్నారు. దేశంలో తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకే యువత విదేశాలబాట పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని 2014లో అధికారంలోకి

రావడానికి ముందు బీజేపీ తమ ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసింది. అయితే వాస్తవంగా జరిగింది వేరు. దేశంలో తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక కన్సల్టెన్సీలకు వేలకొద్దీ డబ్బు చెల్లించి మన యువత విదేశాలకు తరలి వెళుతున్నారు. ధనదాహంతో కొన్ని కన్సల్టెన్సీలు అవకాశాలు లేని దేశాలకు కూడా యువతను పంపడం, అక్కడికి చేరాక వారు అష్టకష్టాలు పడటం తెలిసిందే. కెనడా, అమెరికా వంటి దేశాలకు వెళ్లిన వారికి సైతం తగిన ఉద్యోగాలు లభించక అర్ధాకలితో అలమటిస్తూ, అప్పులపాలై మళ్లీ స్వస్థలాలకు తిరిగి వస్తున్నవారు గణనీయంగా ఉన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నా ఇది ఉద్యోగ, ఉపాధి కల్పించలేని అభివృద్ధిగా మిగిలిపోతున్నది. నిరుపేదలు ఏ పని దొరికితే అ పనికి వెళుతూ జీవితాలు వెళ్లదీస్తున్నారు. చదువుకున్న నిరుద్యోగ యువత మాత్రం తమ అర్హతలకు అనుగుణమైన ఉద్యోగాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పనిచేసే వయసుగల యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించకపోతే అది వారిలో నైరాశ్యానికి, అశాంతికి దారితీసే ప్రమాదముంది. భారత ప్రభుత్వం రెండేళ్ల క్రితం సైన్యంలో చేరదలచిన యువతకు అగ్నిపథ్ పథకాన్ని ప్రకటించగా వేలాదిమంది యువత ముందు కొచ్చారు. మామూలు సైన్యంలో ఇచ్చే జీత భత్యాలు, పింఛను వీరికి రావు. బీజేపీ ప్రభుత్వం ఎక్కువగా వాణిజ్య, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నం దున, అగ్నిపథ్‌లో శిక్షణ పొందినవారు ఐదేళ్ల తర్వాత పరిశ్రమల వారికి రక్షకులుగా పని చేయాల్సి ఉంటుంది. 13కోట్ల జనాభాగల పెద్ద రాష్ట్రం బీహార్‌లో పరిమితమైన రైల్వే ఉద్యోగాలకోసం యువత ఎగబడడంతో అది హింసాకాండకు దారితీసింది. ఆరేళ్ల క్రితం 35వేల ఉద్యోగాల కోసం ప్రకటన రాగా కోటి మంది దరఖాస్తు చేశారు. నియామకాల్లో అవినీతి జరిగి ఆందోళనలకు దారితీసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 368 బంట్రోతు ఉద్యోగాలకు ప్రకటన చేయగా పీహెచ్‌డీలు, పోస్టు గ్రాడ్యుయేట్లు సహా 23లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే పరిస్థితి. దేశంలో మొత్తం నిరుద్యోగిత రేటు6.6శాతం. నగరాలు, పట్టణాలలో 15-19 ఏళ్ల ఉద్యోగార్థుల రేటు అంతకు మూడురెట్లు ఎక్కువగా ఉన్నట్లు 2023 జులై- సెప్టెంబర్ గణాంకాలు ఘోషిస్తున్నాయి. నిరుద్యోగ సైన్యం నానాటికీ పెరిగిపోతుండటం అనేక సమస్యలకు దారి తీస్తున్నది. 2014లో యువత కోటి ఆశలతో కమలం పార్టీకి ఓటేయడంతో నరేంద్ర మోదీ ప్రధానిగా కేంద్రంలో కమలనాథులు అధికారంలోకి వచ్చారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం మోదీ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం కావాలి. అరకొర చర్యలు తప్పితే మోదీ ప్రభుత్వం ఈ రంగంలో పెద్దగా పురోగతి సాధించలేదు. ఉద్యోగాలు కల్పించినా కొన్ని పట్టణాలు, నగరాలలో అసంఘటిత రంగంలో రోజువారీ కూలీపనుల్లో మహిళలే అధికం. 2019-20లో 22శాతంగా ఉన్న ఈ పనులు 2022-23లో 24శాతానికి పెరిగినట్లు పరిశీలనలో తేలింది. పట్టణ యువత నైరాశ్యంతో ఉద్యోగాల కోసం వెదకడం మానేసినట్లు తేలింది. 2023 జులై- సెప్టెంబర్‌లో ఉద్యోగుల చేరిక తగ్గింది. మూడు నెలల్లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంటి తుడుపుగా కొన్ని ఉద్యోగ నియామకాలు చేపట్టాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకాలను ప్రకటించింది. 2023 జులై నాటికి నిరుద్యోగిత రేటు 7.95శాతంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఇండస్ట్రీ వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం 2015 నుంచి ఇప్పటి వరకు 36,643 ఖాళీల భర్తీకి నోటిఫకేషన్లు జారీ చేసినట్లు ఆర్టీఐ ద్వారా సమాచారం లభించింది. మధ్యలో ప్రశ్నా పత్రాలు లీకై కొన్ని పరీక్షల రద్దుకావడం, ఉద్యోగాలు రావనే నిరాశతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడటం శోచనీయం. అయినా పదవులు వెలగ బెట్టిన వారిలో కొంతయినా ఆత్మ పరిశీలన లేకపోవడం విచారకరం. కాగా తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎంగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దాదాపు 2లక్షల పోస్టులకు దశల వారీగా నియామక ప్రక్రియ చేపట్టడం యువతకు ఆశా కిరణంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వ 31విభాగాలలో మంజూరైన పోస్టులు 4,91,304. ప్రస్తుతం 3లక్షల ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారు. స్కూలు విద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలలో దాదాపు 77శాతం మంది పనిచేస్తున్నారు. స్కూలు విద్యాశాఖలో మంజూరైన పోస్టులు 1,37,651కాగా ప్రస్తుతం 1,13,853మంది మాత్రమే పని చేస్తున్నారు. పోలీసు శాఖలో మంజూరైన పోస్టులు 98,384కాగా ప్రస్తుతం 61,212మంది మాత్రమే పని చేస్తున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో మంజూరైన పోస్టులు 52,906కాగా ప్రస్తుతం22,336మంది పని చేస్తున్నారు. కాగా నరేంద్ర మోదీ పదేళ్లపాలనలో 9లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే మోదీ ప్రభుత్వం సాధించిన ఘన విజయమని కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్ అభివర్ణించారు. కానీ యూపీయే పదేళ్ల పాలనలో ఇచ్చినది 6లక్షల ఉద్యోగాలేనని కేంద్రమంత్రి అంటున్నారు. యూపీఎస్సీ ద్వారా మోదీ ప్రభుత్వం 50,906 ఉద్యోగ నియామకాలు చేయగా యూపీఏ హయాంలో ఇచ్చింది. 45,431ఉద్యోగాలేనని, ప్రస్తుత సిబ్బందికి భారీగా పదోన్నతులు కల్పించామని మంత్రి చెప్పారు. భారత ప్రభుత్వంలో మంజూరైన పోస్టులు 40లక్షలు కాగా, ప్రస్తుతం 30లక్షల ఉద్యోగులే పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 8లక్షల ఉద్యోగులు ఉన్నారు. వారిలో 5.6లక్షల రెగ్యులర్,1.3లక్షలమంది గ్రామ,వార్డు సచివాలయాలలో పనిచేస్తున్నారు. 2లక్షల మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్‌లు, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు ఖాళీలు భర్తీ చేస్తే నిరుద్యోగులకు కొంతయినా ఊరట కలుగుతుంది. నైపుణ్య శిక్షణఇచ్చి ప్రైవేటు రంగంలో ఉద్యోగ కల్పనను ప్రోత్సహిస్తే మరి కొన్ని వేలమందికి ఉపాధి లభిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈదిశగా సత్వరం చర్యలు చేపట్టాలి.

సీనియర్ జర్నలిస్ట్
ఫోన్: 9440990381

100 మంది కర్నాటక రైతుల నిర్బంధం

న్యూదిల్లీ : ఫిబ్రవరి 13న నిరసనలో పాల్గొనడానికి దేశ రాజధానికి రైలులో ప్రయాణిస్తున్న కర్నాటకకు చెందిన సుమారు 100 మంది రైతులను రాష్ట్ర పోలీసులు భోపాల్ వద్ద అడ్డుకున్నారని రైతు సంఘం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఎస్‌కేఎం దక్షిణ భారత కన్వీనర్ శాంతకుమార్ మాట్లాడుతూ తాను కూడా రైలులో బృందంతో ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. 'పోలీసులు మమ్మల్ని భోపాల్ స్టేషన్‌లో ఆపివేశారు. మా సభ్యులలో కొంతమంది గాయపడారు' అని ఎలాగోలా దేశ రాజధానికి చేరుకున్న శాంతకుమార్ వివరించారు.

ఒకవైపు కేంద్ర మంత్రులు ఎస్‌కేఎం, ఇతర రైతు సంఘాలతో శాంతి సమావేశాలు నిర్వహిస్తుంటే మరోవైపు ప్రభుత్వం రైతులను నిరసనలో పాల్గొనకుండా ఆపిస్తోందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా దాదాపు 23 మహాపంచాయత్ సమావేశాలు జరిగాయని, మూడు నెలల ముందే నిరసన చేపట్టాలని అనుకున్నామని, ఇది అకస్మాత్తుగా ప్రకటించలేదన్నారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టపరమైన హామీతో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, రైతులు, రైతు కూలీలకు పెన్షన్, వ్యవసాయ రుణమాఫీ, పోలీసు కేసుల ఉపసంహరణ, లఖింపూర్ ఖేరీ హింసాకాండ బాధితులకు 'న్యాయం' చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులను విడుదల చేయాలని డిమాండ్

'దిల్లీ చలో' ప్రదర్శనకు మద్దతుగా కర్నాటక, మధ్య ప్రదేశ్‌తో సహా ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అనేక మంది అన్నదాతలను నిర్బంధించారని, వారిని వెంటనే విడుదల చేయాలని రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ సోమవారం డిమాండ్ చేశారు. మధ్య ప్రదేశ్, కర్నాటక నుంచి ఎస్‌కేఎంకు విధేయత చూపుతూ వస్తున్న అనేక మంది రైతులను భోపాల్‌లో నిర్బంధించారని దల్లేవాల్ పేర్కొన్నారు. 'ఒకవైపు (కేంద్రం) మాతో చర్చలు జరుపుతూనే మరోవైపు మా వాళ్లను నిర్బంధిస్తున్నారు.. అలాంటప్పుడు ఈ చర్చ ఎలా జరుగుతుంది? అని ఎస్‌కేఎం నాయకుడు అయిన దల్లేవాల్ అన్నారు. 'మా రైతులను విడుదల చేయాలని మేము ప్రభుత్వానికి చెప్పాము. ప్రభుత్వం చర్చలకు సానుకూల వాతావరణాన్ని సృష్టించాలి. ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెబితే, రైతులు మరింత సానుకూలంగా ఉంటారు. ప్రదర్శనలో పాల్గొని ఎటువంటి నష్టం కలిగించాలనే ఉద్దేశం మాకు లేదు. మేము శాంతియుత నిరసనలు చేస్తాము' అని భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా సిద్ధూపూర్) అధ్యక్షుడు దల్లేవాల్ అన్నారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు 'దిల్లీ చలో' ప్రదర్శనలో పాల్గొనాలనుకునే రైతులను వేధిస్తున్నారని హరియాణా ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఓ వైపు రైతులతో చర్చలు జరుపుతున్న ప్రభుత్వం మరోవైపు పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో బారికేడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అన్నదాతలపై కేంద్రం కర్కశత్వం: ఖర్గే

దిల్లీ చలోకు తాము మద్దతిస్తున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో కిసాన్, జవాన్ నాశనమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలపై మోదీ సర్కారు కర్కశత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రం చర్యలను తప్పుబట్టారు. దిల్లీలోకి ప్రవేశించకుండా సరిహద్దుల్లో పోలీసులు ఏర్పాటు చేసిన క్రేన్‌లు, బారికేడ్లు, ముళ్లకంచెలు వంటి వాటికి సంబంధించిన వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఎక్స్‌లో షేర్ చేశారు. రైతుల పట్ల ఈ విధంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇదే విషయంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ నరేంద్రమోదీపై విరుచుకు పడ్డారు. అన్నదాతలపై ఇలాంటి వైఖరి ప్రదర్శిస్తున్న ప్రభుత్వాన్ని ఇంటికి తరిమికొట్టాలని మండిపడ్డారు. కనీస మద్దతు ధర సహా ఇతర సమస్యలను పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా వంటి రైతు సంఘాలు ఆందోళనల్లో పాల్గొననున్నాయి. 'ప్రభుత్వం ఓ వైపు చర్చలకు ఆహ్వానిస్తూనే సరిహద్దుల వెంబడి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తోంది. సరిహద్దులు మూసివేశారు. 144వ సెక్షన్ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. అసలు ప్రభుత్వానికి ఈ అధికారం ఎక్కడిది. ఇలాంటి పరిస్థితుల మధ్య నిర్మాణాత్మక చర్చలకు అవకాశం ఉండదు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించాలని రైతు నాయకుడు జగ్‌జిత్ సింగ్ దాలెవాల్ అన్నారు.

రేషన్ షాపుల్లో మోదీ పోస్టర్లు కుదరదు

కేరళ సీఎం విజయన్ స్పష్టీకరణ

తిరువనంతపురం: మోదీ సర్కారుపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా గల చౌక ధరల దుకాణాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టాలని కేంద్రం ఆదేశించడం సరికాదని, దాన్ని అమలుచేయడం కష్టమని విజయన్ స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో రేషన్ దుకాణాల్లో మోదీ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేయడం నిజమేనా అని అడిగిన ప్రతిపక్ష ఎమ్మెల్యే పి.అబ్దుల్ హమీద్ ప్రశ్నకు ముఖ్యమంత్రి స్పందించారు. విజయన్ మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ వ్యవస్థ ఎప్పటి నుంచో ఉందని, వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం కొత్త ప్రచార పద్ధతిని అనుసరిస్తున్నట్లు స్పష్టమవుతోందని మండిపడ్డారు. ఈ ఆదేశాలు ఎంతమాత్రం సరికావని, వాటిని రాష్ట్రంలో అమలు చేయడం కష్టమని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలా లేదా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కేరళ పౌరసరఫరాల శాఖ మంత్రి జీఆర్ అనిల్ మాట్లాడుతూ 14 వేలకు పైగా ప్రధాని పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ), రాష్ట్ర ఆహార శాఖకు బాధ్యత అప్పగించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 550 రేషన్ దుకాణాల్లో పీఎం సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేయాలని కేంద్రం ఆదేశించిందని, వాటిని తనిఖీ చేయాల్సిందిగా ఎఫ్‌సీఐ అధికారులకు సూచించామన్నారు. ఆహార పదార్థాల పంపిణీకి కేంద్ర ప్రభుత్వ గుర్తులున్న క్యారీ బ్యాగ్‌లు సరఫరా చేయాలని చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారం కోసం రేషన్ పంపిణీ వ్యవస్థను ఉపయోగించుకోవడం సరికాదని మంత్రి దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌కు మరో షాక్

మాజీ సీఎం అశోక్ చవాన్ రాజీనామా

ముంబై: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ సోమవారం ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కొద్ది రోజుల్లో ఆయన బీజేపీలో చేరనున్నారు. ప్రస్తుతం చవాన్... భోకర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా ఆయన స్పీకర్‌కు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. సుమారు నెల రోజుల వ్యవధిలో మహారాష్ట్ర నుంచి కాంగ్రెస్‌ను వీడిన రెండో కీలక నేత చవాన్. కొద్దిరోజుల క్రితం కేంద్ర మాజీమంత్రి మిలింద్ దేవ్‌రా కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లి, ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరారు. 48 ఏళ్లుగా కాంగ్రెస్‌లో కొనసాగిన మరో సీనియర్ నేత బాబా సిద్ధిక్... ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి... అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీలో చేరారు. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతంలో చవాన్ కుటుంబానికి పట్టు ఉంది. ప్రస్తుత పరిణామం రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలేతో ఉన్న విభేదాలు ఆయన రాజీనామాకు దారితీసినట్లు తెలుస్తోంది. కాగా, తనతో పాటు 10-12 మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారని చవాన్ చెప్పారు.

మోదీ హయాంలో ఉపాధి కరువు

రాహుల్‌గాంధీ విమర్శ

రాయ్‌పూర్: మోదీ ప్రభుత్వ హయాంలో దేశ ప్రజలకు ఉపాధి కరువైందని, దీంతో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమరించారు. రాహుల్ యాత్ర సోమవారం చత్తీస్‌గఢ్‌లో కొనసాగింది. దేశ జనాభాలో 74 శాతం మంది వెనుకబడిన తరగతులు, దళితులు, ఆదివాసీలే ఉన్నారని, భారత్‌లో అగ్రశ్రేణిలో ఉన్న 200 కంపెనీల్లో ఎక్కువగా ప్రజాధనం ఉందని చెప్పారు. వీటిలో ఏ ఒక్కదానిలోనూ ఓ దళితుడు యజమానిగా లేడని ఆరోపించారు. మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తూ మీ జేబులు దోచుకుంటున్నారని, ఇకనైనా మేల్కోవాలని రాహుల్ అన్నారు.

యూపీలో రాహుల్ షెడ్యూల్ మార్పు

రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' ఉత్తరప్రదేశ్ షెడ్యూల్ మారింది. ఆ రాష్ట్రంలో కొనసాగాల్సిన యాత్ర కాల వ్యవధిని తగ్గించినట్లు పార్టీ వర్గాలు సోమవారం వెల్లడించాయి. యూపీలో 10, 12 తరగతుల విద్యార్థులకు బోర్డు పరీక్షలు జరగనున్నందున ఈ సవరణలు చేసినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రజా ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని, యూపీలో ఫిబ్రవరి 22 నుంచి బోర్డు పరీక్షలు ప్రారంభం కానున్నాయని, అందువల్ల రాష్ట్రంలో 26 వరకు కొనసాగనున్న యాత్రను ఈ నెల 21కే ముగిసేలా రాహుల్ మార్పులు చేశారని రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి అన్షు అవస్థీ ఓ ప్రకటనలో వెల్లడించారు. దీని ప్రకారం ఫిబ్రవరి 16న వారణాసి మీదుగా యాత్ర యూపీలోకి ప్రవేశిస్తుంది. అనంతరం భదోహి, ప్రయాగ్‌రాజ్, ప్రతాప్‌గఢ్ మీదుగా 19న అమేథీకి చేరుతుంది. ఆ నియోజకవర్గంలోని గౌరీగంజ్ బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తారు. మరుసటి రోజు రాయ్‌బరేలీకి చేరుకుని... అక్కడి నుంచి లక్నో చేరుకుంటారు. రాష్ట్ర రాజధానిలో భారీ ర్యాలీ నిర్వహిస్తారు. 21న కాన్పూర్‌లోకి యాత్ర ప్రవేశిస్తుంది. అదే రోజు ఝాన్సీ నుంచి మధ్యప్రదేశ్‌లోకి వెళ్లనున్నట్లు అవస్థీ పేర్కొన్నారు.

రాజ్యసభకు సోనియాగాంధీ పోటీ ?

న్యూదిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభ కు పోటీ చేసే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి లోక్‌సభ నియోజకవర్గానికి ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి రాయబరేలి కంచుకోటగా ఉన్నప్పటికీ ఈసారి సోనియాగాంధీ రాజ్యసభకు పోటీ చేస్తారనే ఊహాగానాలు కొద్దికాలంగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేత, న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి రాజ్యసభ అభ్యర్థిగా కర్నాటక నుంచి పోటీ చేస్తారని, సైయద్ నసీర్ హుస్సేన్‌కు తిరిగి టికెట్ ఇస్తారని, అజయ్ మాకెన్‌కు కూడా రాజ్యసభకు నామినేట్ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. కాగా మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు పోటీ చేయాలని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ శాఖ సోనియాను కోరింది. ఇటీవల పార్టీ సీనియర్ నేత కమల్‌నాథ్ దిల్లీలో సోనియాను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారి సోమవారం వెల్లడించారు. సోనియా మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించాలని రాష్ట్రంలోని పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని తెలిపారు. అలాగే రాజ్యసభకు వెళ్లడానికి ఆసక్తికనబర్చినట్లయితే కమల్‌నాథ్‌కు సైతం మద్దతు తెలపడానికి రాష్ట్ర పార్టీ సిద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. కాగా ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తమ రాజ్యసభ అభ్యర్థుల పేర్లను ప్రకటించనుంది. రాజ్యసభ ఎన్నికల తేదీని గత జనవరి 29న ఎన్నికల కమిషన్ ప్రకటించింది. వివిధ రాష్ట్రాల్లోని 56 రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న పోలింగ్ ఉంటుంది. అదే రోజు కౌంటింగ్ కూడా జరుగుతుంది. ఫిబ్రవరి 15వ తేదీతో నామినేషన్ల దాఖలు గడువు ముగియనుండగా, ఫిబ్రవరి 16న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఫిబ్రవరి 20తో ముగుస్తుంది. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ పోలింగ్ జరిపి, 5 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తారు.

మారని తమిళనాడు గవర్నరు తీరు

అసెంబ్లీలో ప్రసంగ పాఠం చదవని రవి

చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే సర్కారు, గవర్నర్ మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాసనసభకు వచ్చిన గవర్నర్ ఆర్ఎన్ రవి సంప్రదాయబద్ధమైన ప్రారంభ ప్రసంగం చేయడానికి నిరాకరించారు. జాతీయ గీతాన్ని ప్రభుత్వం గౌరవించలేదని ఆరోపిస్తూ... నిమిషాల వ్యవధిలోనే సభ నుంచి వెళ్లిపోయారు. గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయ గీతం ఆలపించాలని తాను పదే పదే చేసిన అభ్యర్థనలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో చాలా అంశాలను నైతిక కారణాలతో తాను అంగీకరించలేదని గవర్నరు చెప్పుకొచ్చారు. ఆ అంశాలలో చాలావాటిని తాను అంగీకరించలేనని, తన ప్రసంగంలో వాటిని పేర్కొంటే రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే అవుతుందన్నారు. అందుకే ఈ ప్రసంగాన్ని ఇక్కడితో ముగిస్తున్నానని పేర్కొంటూ గవర్నర్ సభను వీడారు.

గతేడాది కూడా ప్రసంగం విషయంలో గవర్నర్ ఇలాగే వ్యవహరించారు. బడ్జెట్ సమావేశంలో ప్రభుత్వం సిద్ధం చేసి ఆమోదం పొందిన ప్రసంగంలోని కొన్ని భాగాలు మినహాయించి, కొన్ని వాక్యాలు అదనంగా చేర్చి గవర్నర్ ప్రసంగించడం నాడు తీవ్ర దుమారం రేపింది. గవర్నర్ సొంతంగా చేర్చిన వ్యాఖ్యలను సభా రికార్డులో చేర్చకూడదని, ప్రభుత్వం సిద్ధం చేసిన గవర్నర్ ప్రసంగాన్ని మాత్రమే యథాతథంగా రికార్డులో నమోదు చేయాలని స్టాలిన్ తీసుకొచ్చిన తీర్మానం ఆమోదం పొందింది. ఈ వ్యవహారం గవర్నర్, స్టాలిన్ సర్కార్ మధ్య విభేదాలకు మరింత ఆజ్యం పోసింది. తాజాగా మరోసారి ఆయన ప్రసంగించేందుకు నిరాకరించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా ఇటీవల కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కూడా బడ్జెట్ సమావేశాల్లో తన ప్రసంగాన్ని రెండు నిమిషాల్లోపే ముగించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా విజయన్ సర్కారుపై అసంతృప్తిగా ఉన్న ఆయన... ప్రభుత్వం ఇచ్చిన 62 పేజీల ప్రసంగం చదివేందుకు ఇష్టపడలేదు. కేవలం 84 సెకన్లలో చివరి పేరా చదివి సభ నుంచి వెళ్లిపోయారు.

మనీశ్ సిసోడియాకు తాత్కాలిక బెయిల్

న్యూదిల్లీ: దిల్లీ మద్యం విధానం కేసులో అరెస్ట్ అయ్యి జైలులో ఉన్న దిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు మూడు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు అయింది. తనకు మూడు రోజులు బెయిల్ ఇవ్వాలని సిసోడియా రూస్ అవెన్యూ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిపై విచారణ చేపట్టిన రూస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజులు బెయిల్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు సిసోడియా తన మేనకోడలు వివాహానికి హాజరవుతారని సమాచారం. దిల్లీ మద్యం పాలసీకి సంబంధించి అవినీతి కేసులో సీబీఐ 26, ఫిబ్రవరి 2023న మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సైతం మార్చి 9న ఆయన్ను అరెస్ట్ చేసింది.

హేమంత్ సోరెన్ కస్టడీ పొడిగింపు

రాంచీ: భూకుంభకోణం కేసులో మనీలాండరింగ్ కింద అరెస్టయిన జేఎంఎం నేత, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈడీ కస్టడీని మరో మూడు రోజులు పొడిగించారు. రాంచీలోని ప్రత్యేక పీఎంఎల్ఏ కోర్టు సోమవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. ఈనెల 7వ తేదీన ఐదు రోజుల పాటు ఈడీ కస్టడీకి ప్రత్యేక కోర్టు ఆదేశించింది. సోమవారంతో రిమాండ్ గడువు తీరనుండటంతో ఆయనను కోర్టు ముందు హాజరుపరిచారు. సోరెన్‌ను మరో నాలుగు రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరగా, మూడు రోజుల కస్టడీకి ప్రత్యేక కోర్టు అంగీకరించింది. కాగా, ఈడీ అరెస్టును సవాలు చేస్తూ సోరెన్ వేసిన పిటిషన్‌పై విచారణను జార్ఖండ్ హైకోర్టు ఫిబ్రవరి 27వ తేదీకి వాయిదా వేసింది. కేసుకు సంబంధించి వివరాలతో కూడిన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించాలని ఈడీని ఆదేశించింది.

నితీశ్ మళ్లీ తిరగబడరని మోదీ హామీ ఇస్తారా?

విశ్వాస పరీక్షపై చర్చలో ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్

పాట్నా: బీజేపీ-జేడీయూ ప్రభుత్వంపై ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ సోమవారం విరుచుకుపడ్డారు. 'నితీశ్ కుమార్ మళ్లీ తిరగబడరని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇవ్వగలరా' అని ప్రశ్నించారు. నితీశ్ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై జరిగిన చర్చల్లో తేజస్వి పాల్గొని మాట్లాడుతూ లాలూ యాదవ్‌కు చెందిన ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి మహాఘట్బంధన్‌లో చేరేందుకు 2022లో ఎన్‌డీఏతో నితీశ్ బంధాన్ని తెంచుకున్నప్పటికీ, బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) లో చేరారని విమర్శించారు. 'మా పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నందున ఎన్‌డీఏ నుంచి వైదొలగుతున్నామని మీరు అప్పుడే చెప్పారు' అని గుర్తు చేశారు. నితీశ్‌ను తాను ఎప్పుడూ పితృమూర్తిగా భావిస్తానని తెలిపారు. బీహార్‌లోని 'మహాఘట్బంధన్' ప్రభుత్వానికి బీజేపీ భయపడిందని, నితీశ్ మళ్లీ తిరగబడరని మోదీ హామీ ఇవ్వగలరా అని ప్రశ్నించారు. నితీశ్ తరచూ పొత్తులు మార్చుకుంటున్నారని విమర్శిస్తూ, అతని విశ్వసనీయతను ప్రశ్నించారు. నితీశ్ 2013 నుంచి ఐదుసార్లు పొత్తులు మార్చుకున్నారని, అన్ని సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారని తెలిపారు. నితీశ్‌ను విమర్శించడానికి తేజస్వి యాదవ్ రామాయణ సందర్భాన్ని ఉపయోగించాడు. బాహ్య ఒత్తిళ్ల కారణంగా తన కొడుకును అడవికి పంపిన దశరథుడి పాత్రతో పోల్చారు. 'రాముడిని అరణ్యానికి పంపినప్పుడు దశరథ రాజు చేసినట్లే అతనిని బలవంతం ఉండవచ్చు. దశరథుడు అది కోరుకోలేదు. కానీ కైకేయి చేసింది. మీరు ముఖ్యమంత్రిగా ఉండి, మీరు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని మేము కోరుకుంటున్నాము. కానీ మీ చుట్టూ ఉన్న కైకేయిని కూడా గుర్తించండి' అని అన్నారు. అయితే, తేజస్వి వ్యాఖ్యలకు నితీశ్ ఎదురుదాడి చేస్తూ, 2005లో తాను అధికారం చేపట్టినప్పటి నుంచి బీహార్‌లో గణనీయమైన అభివృద్ధి జరుగుతోందని నితీశ్ కుమార్ బల పరీక్షకు ముందు జరిగిన చర్చలో తెలిపారు. బీహార్ ప్రజలకు సేవ చేయడంలో తేజస్వి యాదవ్ పార్టీ విఫలమైందని ఆరోపించారు. '2005 నుంచి నేను అధికారంలోకి వచ్చాక బీహార్‌లో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరిగింది. అంతకు ముందు ఆయన (తేజస్వి యాదవ్) తంద్రీతల్లి బీహార్‌కు 15 ఏళ్లపాటు సేవ చేసే అవకాశం వచ్చింది. ఏం చేశారు? గతంలో ఎన్నో గొడవలు జరిగేవి. హిందువులు, ముస్లింల మధ్య, కానీ నేను అధికారంలోకి వచ్చాక ఈ వివాదాలు ఆగిపోయాయి' అని నితీశ్ చెప్పుకొచ్చారు.

బీహార్‌లో మోదీని అడ్డుకునేది మీ మేనల్లుడు!

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ నితీష్ కుమార్‌ను ఎగతాళి చేస్తూ, రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీని ఆపబోయేది మీ 'మేనల్లుడు' అని పేర్కొన్నారు. 'మిమ్మల్ని (నితీశ్ కుమార్) మా కుటుంబ సభ్యుడిగా భావిస్తున్నాం. మేం సమాజ్‌వాదీ కుటుంబానికి చెందిన వాళ్లం... జో ఆప్ ఝుండా లే కర్ కే చలే ది కి మోదీ కో దేశ్ మే రోక్నే హైం, అబ్ ఆప్కా భతీజా ఝుండా ఉఠా కర్ కే మోదీ కో బీహార్ మే రోక్నే కా కామ్ కరేగా దేశంలో మోదీని అడ్డుకునేందుకు జెండా మోసిన మీరు, ఇప్పుడు బీహార్‌లో ప్రధానిని అడ్డుకునేందుకు మీ భతీజ (మేనల్లుడు) జెండా మోస్తారు' అని రాష్ట్ర అసెంబ్లీలో ఆవేశపూరిత ప్రసంగంలో పేర్కొన్నారు. జేడీయూ ఎమ్మెల్యేల పట్ల నాకు బాధగా ఉందని, ఎందుకంటే వారు ప్రజల మధ్యకు వెళ్లి సమాధానం చెప్పవలసి ఉంటుందన్నారు. 'నితీశ్ కుమార్ 3 సార్లు ప్రమాణ స్వీకారం ఎందుకు చేసారని ఎవరైనా అడిగితే మీరేం చెబుతారు? ఇంతకు ముందు వాళ్లను (బీజేపీ) విమర్శించే వాళ్లం. ఇప్పుడు వాళ్లను పొగుడుతున్నారు, ఏమి చెబుతారు? మేం (ఆర్‌జేడీ) ఉద్యోగాలు ఇచ్చామని చెబుతాం' అని అన్నారు. 'నేను ఈ కొత్త ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడతాను. 9 సార్లు ప్రమాణం చేసి చరిత్ర సృష్టించినందుకు సీఎం నితీశ్‌కు ధన్యవాదాలు చెప్పాలనుకుంటున్నాను' అని అన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను మేము ఎల్లప్పుడూ 'గౌరవిస్తాం' అని నొక్కి చెప్పారు. అధికార ఎన్‌డీఏ కూటమిలో భాగమైన హిందుస్థానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) నాయకుడు జితన్‌రామ్ మాంఝీపై విమర్శలు గుప్పిస్తూ... ఈ బీహార్ మాజీ సీఎం అంతకు ముందు నితీశ్ మానసిక పరిస్థితిని ప్రశ్నించారని, ఆయన తాజా నిర్ణయం తర్వాత సీఎం నితీశ్‌కు ఇప్పుడు ఏమి మందు ఇస్తారని మాంఝీ ప్రకటనను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. బీజేపీ భారతరత్న అవార్డును ఓట్ల కోసం బేరసారంగా ఉపయోగించుకుందని ఆరోపించారు. ఈ ఏడాది బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు అవార్డును ప్రదానం చేయడాన్ని ఆయన ఈ ఆరోపణ ఒప్పందానికి ఉదాహరణగా పేర్కొన్నారు. 'కర్పూరీ ఠాకూర్‌కు (భారతరత్న) లభించినందుకు నేను సంతోషిస్తున్నాను. మాతో పొత్తు పెట్టుకోండి. మేము మీకు భారతరత్న ఇస్తాము. వారు (బీజేపీ) భారతరత్న ఒప్పందం కుదుర్చుకున్నారు' అని తేజస్వి అన్నారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో నితీశ్ కుమార్ 129 ఓట్లతో విజయం సాధించారు. ఓటింగ్‌కు ముందే ఆర్‌జేడీ సహా విపక్షాలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశాయి. కనీసం ఐదుగురు ఆర్‌జేడీ ఎమ్మెల్యేలు ఫిరాయించి నితీశ్ కుమార్‌కు ఓటు వేశారు. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆర్‌జేడీతో తెగతెంపులు చేసుకున్న నితీశ్ గత నెలలో తొమ్మిదోసారి బీహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

వరుణ్ గాంధీ దారెటు?

లక్నో: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. యూపీలోని పిలిభిత్ లోక్‌సభ స్థానంపై చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థి వరుణ్ గాంధీ ఎంపీగా ఉన్నారు. అయితే ఈసారి ఆయనకు టికెట్ వస్తుందా లేదా అనే దానిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. వరుణ్ సొంత పార్టీ ప్రభుత్వంపై చాలాకాలంగా విమర్శలు చేస్తున్నారు. ఫలితంగా ఈసారి బీజేపీ నుంచి వరుణ్ గాంధీకి టికెట్ రాదని స్థానిక బీజేపీ నేతలు అంటున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు స్థానిక నేతలతో పాటు బయటి బీజేపీ నేతలు ఈ స్థానం నుంచి బరిలో దిగేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తూ ఇప్పటివరకూ 33 దరఖాస్తులు వచ్చాయని బీజేపీ పిలిభిత్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్ ప్రతాప్ సింగ్ తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ దరఖాస్తులను పార్టీ అధిష్ఠానానికి పంపుతామని, వీటిపై అగ్రనేతలు తుది నిర్ణయం తీసుకుంటారన్నారు. 90వ దశకంలో నైనిటాల్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఉన్న బల్‌రాజ్ పాసి ఆరు నెలలుగా పిలిభిత్‌లోనే తిష్టవేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. బిత్రీ చైన్‌పూర్ ఎమ్మెల్యే పప్పు భరతౌల్ కూడా పిలిభిత్ నుండి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఎంపీ వరుణ్ గాంధీ తన సొంత ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం ప్రారంభించినప్పటి నుండి స్థానిక నేతలు ఈ పార్లమెంట్ సీటుపై కన్నువేశారు.

కారును ఢీకొన్న బస్సు... ఐదుగురి సజీవదహనం

న్యూదిల్లీ: ఉత్తరప్రదేశ్ మథుర పరిధిలోని మహావాన్ వద్ద యమునా ఎక్స్‌ప్రెస్ వేపై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. 40 మందితో ప్రయాణిస్తున్న బస్సు కారును ఢీకొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందారు. బస్సు బీహార్ నుంచి దిల్లీ వైపు వెళుతోంది. ఈ ప్రమాదం కారణంగా చెలరేగిన మంటల్లో కారు పూర్తిగా కాలిపోయి అందులోని వ్యక్తులు సజీవ దహనమయ్యారు. బస్సులో ఉన్నవారంతా ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు నామినేషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో సోమవారం సీఎం జగన్‌ను వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి కలిశారు. వీరికి బీఫాంలను సీఎం అందజేశారు. అనంతరం వీరు అసెంబ్లీలో రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సంయుక్త కార్యదర్శి ఎం.విజయరాజుకు నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ 175 స్థానాల గెలుపు దిశగా తాము పనిచేస్తామని, జగన్ తిరిగి సీఎం కావడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి, ఉప కార్యదర్శి వనితా రాణి, అభ్యర్థులు తరపున రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ ఎంపీ విజయసాయి రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, గడికోట శ్రీకాంత్ రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ సీట్ల కసరత్తు

సీఎం జగన్‌తో బాలినేని, వల్లభనేని, కొడాలి నాని చర్చలు

విశాలాంధ్ర-అమరావతి: వైసీపీలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల మార్పు కొనసాగుతోంది. ఇప్పటికే 6 జాబితాలు ప్రకటించి 32 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలకు టికెట్లు ఇవ్వని ముఖ్యమంత్రి జగన్... మరికొంత మందిని తప్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అనేక మార్పులతో ఏడో జాబితాను రూపొందిస్తున్నారు. ఈ మేరకు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కసరత్తు చేస్తున్నారు. మార్పులు చేయనున్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు తాడేపల్లి నుంచి పిలుపు వచ్చింది. అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో సీఎంను వారంతా కలిశారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి అనేక నియోజకవర్గాల్లో మార్పులు జరుగుతున్నాయి. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. తన కుమారుడిని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఒంగోలు ఎంపీగా పార్టీ దాదాపుగా నిర్ణయించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి అభ్యర్థిత్వాన్ని బాలినేని వ్యతిరేకిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం మాత్రం చెవిరెడ్డిని తప్పించేది లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అవసరమైతే తానే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమని బాలినేని ప్రతిపాదన పెట్టినట్లు తెలిసింది. ఈ అంశంపైనా సీఎంవోలో బాలినేని చర్చించారని తెలిసింది. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచి వైసీపీకి మద్దతిస్తోన్న గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సీఎం జగన్‌ను కలిసి తన సీటు విషయమై చర్చించారు. అలాగే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అనేక అంశాలపై చర్చించారు. కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌ను మార్చాలని యోచిస్తోన్న జగన్... ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తున్నారు. ఈ అంశంపై ఆయనతో మాట్లాడినట్లు సమాచారం. టికెట్ కోల్పోయిన కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ సీఎంను కలిసి తనకు ఎక్కడో ఓ చోట టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరినట్లు తెలుస్తోంది.

17న 'జీఎస్ఎల్వీ ఎఫ్14' ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు ఈ నెల 17వ తేదీన శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ రాకెట్ ద్వారా ఇన్సాట్ 3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం బరువు 2275 కిలోలు కాగా... వాతావరణ అధ్యయనం, సముద్ర ఉపరితలాల పై పరిశోధన, వాతావరణ విపత్తులపై సమగ్ర సమాచారం కోసం దీనిని ప్రయోగిస్తున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఉపగ్రహ అనుసంధాన కార్యక్రమం పూర్తి చేసినట్లు ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు. ఆదివారం వ్యాబ్ నుండి రెండవ ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించారు. అన్ని పరీక్షల అనంతరం వాతావరణం అనుకూలిస్తే ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు శ్రీహరికోట లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ ఎఫ్14 రాకెట్ ద్వారా దీనిని నింగిలోకి పంపనున్నారు.

14న గ్రూప్-2 హాల్‌టికెట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రూప్-2 పరీక్షల హాల్‌టికెట్లను ఈనెల 14వ తేదీన కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గ్రూప్-2 సర్వీసెస్ నియామకానికి సంబంధించిన స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్షను ఈనెల 25వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు (జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ) 24 జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తామని వివరించింది. అర్హత గల అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ (https://psc.ap.gov.in) లోకి వెళ్లి హాల్‌టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవాలి. అభ్యర్థులు ముందుగానే హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని, మార్గదర్శకాలు, సూచనల ద్వారా వెళ్లాలని ఏపీపీఎస్సీ సూచించింది.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై

సుప్రీంలో 26న తదుపరి విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. సీనియర్ న్యాయవాది హరీశ్‌సాల్వే అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేయాలని చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. దీనిపై సీఐడీ తరపు న్యాయవాది రంజిత్‌కుమార్ స్పందిస్తూ కౌంటర్ దాఖలుకు గతంలో సమయం తీసుకుని, ఇప్పుడు మళ్లీ వాయిదా కోరుతున్నారని కోర్టుకు తెలిపారు. చంద్రబాబు తరపున ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశారని, అందువల్ల సాధ్యమైనంత ముందుగా తదుపరి విచారణ తేదీని నిర్ణయించాలని కోరారు. దీంతో తొలుత రెండు వారాల తర్వాత జాబితా చేయాలని ఆదేశించిన ధర్మాసనం... రంజిత్‌కుమార్ విజ్ఞప్తితో ఈనెల 26వ తేదీకి వాయిదా వేసింది. చంద్రబాబుకు బెయిల్ మంజూరులో తమ వాదనలు, ఆధారాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని సీఐడీ తమ పిటిషన్‌లో పేర్కొంది. అలాగే ప్రభుత్వ ధనం దుర్వినియోగం అయిందన్న అంశాన్ని కూడా హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదని, చంద్రబాబు బెయిల్‌ను వెంటనే రద్దు చేయాలని సుప్రీం కోర్టును సీఐడీ కోరింది. దీనిపై గత నెల 19న విచారణ సందర్భంగా కౌంటర్ దాఖలుకు సమయం కావాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. దీంతో రెండు పక్షాలు తమ వాదనలను లిఖితపూర్వకంగా సమర్పించాలని సుప్రీం ధర్మాసనం సూచించింది. తిరిగి ఈ రోజు ధర్మాసనం ముందుకు విచారణకు రాగా, రెండు పక్షాల అభ్యర్థనల అనంతరం ఈ నెల 26వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేస్తూ ధర్మాసనం నిర్ణయం వెలువరించింది.

దగ్ధమైన పంటకు పరిహారం ఏది?

అగ్నిప్రమాద బాధిత పసుపు రైతుల ధర్నా

మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరుకార్పొరేషన్: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజిలో దగ్ధమైన ఘటనలో పసుపు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ వారు కోల్పోయిన పసుపు బస్తాల మొత్తం విలువలో సగం మొత్తాన్ని తక్షణం విపత్తుల నిధుల నుండి గాని, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి గానీ నష్టపరిహారంగా ఇవ్వాలని, మిగిలిన సగం మొత్తాన్ని బీమా ద్వారా నష్టపరిహారం కింద ఇప్పించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం పంట నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల ఐక్యకార్యచరణ కమిటీ అధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధిత రైతులు ధర్నా చేశారు. కమిటీ కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... దుగ్గిరాల కోల్డ్ స్టోరేజిలో అగ్ని ప్రమాదం జరిగి 24 రోజులు అయిందన్నారు. ఈ ఘటనలో జిల్లా కలెక్టర్ 11 మందితో కమిటీ వేసినప్పటికీ ఎంత మంది రైతులు ఎంతమేర పంట నిల్వ చేసుకున్నారు...ఎంతవరకు కాలిపోయింది... తగలబడే సమయంలో ఇతర గదులలో ఉన్న పసుపును తీయడానికి ఎందుకు ప్రయత్నం చేయలేదు... ఎంత బీమా చేశారు... తదితర వివరాలేవి తెలియజేయ లేదన్నారు. కొంతమంది రైతుల వద్ద బాండ్లు ఉన్నాయని, చాలమంది రైతుల వద్ద కేవలం పంట నిల్వ ఉన్న రశీదులు మాత్రమే ఉన్నాయన్నారు. కోల్డ్ స్టోరేజి యాజమాన్యం స్లిప్పులు ఇచ్చి బాండ్లు ఇవ్వకుండా తర్వాత ఇస్తామని చెప్పి సరుకు నిల్వ పెట్టుకున్నారని చెప్పారు. ప్రస్తుతం విచారణ కమిటీ అధికారులు రైతుల దగ్గర ఉన్న వేమెంట్ స్లిప్పును తీసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. యాజమాన్యం ఇచ్చిన వేమెంటు స్లిప్పును కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. జనవరి 19వ తేదీ ధరతో పసుపు రైతులందరికీ నష్టపరిహారం ఇప్పించాలని, కోల్డ్ స్టోరేజి అగ్నిప్రమాదంపై అధికారుల కమిటీ దర్యాప్తును సత్వరం పూర్తిచేసి సర్వం కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ జనవరి 19న కోల్డ్ స్టోరేజి దగ్ధమైన ఘటనలో ఆ రోజు లెక్కల ప్రకారం లక్షా 17వేల బస్తాలు తగలబడి ఉండొచ్చని యాజమాన్యం ఇచ్చిన లెక్కల ప్రకారం మార్కెట్ కమిటీ వారు విడుదల చేశారని, అయితే ఇప్పటికీ నివేదిక బయటకు రాని పరిస్థితిని చూస్తున్నామన్నారు. కేవలం 65వేల బస్తాలు, 320 మంది రైతులకు సంబంధించి మాత్రమే నివేదిక వచ్చినట్లు తెలుస్తోందన్నారు. మిగతా వివరాలతో నివేదికను పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గాని, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖా మంత్రులు గానీ దీనిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. కలెక్టర్ తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్ట పరిహారాన్ని ఇప్పించాలని, బీమా కంపెనీతో మాట్లాడి మూడు నెలల్లో డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ కొన్నేళ్లుగా పసుపుకు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని... ధర పెరుగుతున్న తరుణంలో పంట నిల్వ చేసిన కోల్డ్ స్టోరేజీ తగలబడడంతో వందలాది కుటుంబాలు సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ యుద్ధప్రాతిపదికన నివేదిక తయారుచేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజి యాజమాన్యం కొంతమంది రైతులకు బాండ్లు ఇవ్వకుండా స్లిప్పులపైన లాట్ నెంబరు, బ్లాక్ నెంబరు వ్రాసి ఇచ్చిన రశీదులను పరిగణలోకి తీసుకొని రైతులకు న్యాయం చేయాని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కల్లం రాజశేఖర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, రైతు సంఘం జిల్లా నాయకులు విఠల్ రెడ్డి, పసుపు రైతులు చందు సత్యనారాయణ, గుళ్ళపల్లి సుబ్బారావు, మల్లుపెద్ది రామలింగేశ్వర రావు, నాదెండ్ల సురేంద్ర, లంకిరెడ్డి నాగేశ్వర రెడ్డి, పేర్ని రవి కిషోర్, నూతలపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

సైకో పాలన ఉండేది రెండు నెలలే

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే
శంఖారావం సభల్లో లోకేశ్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రంలో విధ్వంస పాలన సాగిస్తున్న సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం ఇక రెండు నెలలేనని... వచ్చే ఎన్నికల్లో వచ్చేది టీడీపీ - జనసేన ప్రభుత్వమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాల వలసలో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... విధ్వంసకర పాలన సాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధిని తిరోగమన దిశలో పయనించే లా చేసిన జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు రాష్ట్రం లోని అన్ని వర్గాల ప్రజలు సిద్ధం గా ఉన్నారన్నారు. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డి పేరు ఛార్జ్‌షీట్ లో ఉందని, జగన్ పేరు కూడా చేరుతుందన్నారు. మద్యం ద్వారా ఏటా రూ.9 వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.45 వేల కోట్లు మింగేశాడని, మద్యం తయారు చేసేది అమ్మేది జగనే అన్నారు. జగన్ రెడ్డిని చూస్తే కటింగ్, ఫిట్టింగ్ మాస్టర్ గుర్తొస్తాడు. ఆయన బ్లూ బటన్ నొక్కి రూ.10 ఎకౌంట్లలో వేస్తే రెడ్ బటన్ నొక్కి వంద లాగేస్తున్నాడని, కరెంట్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు పెంచారని, చెత్తపై కూడా పన్ను వేసి జనం జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. అవకాశమిస్తే గాలిపైన కూడా పన్ను వేస్తాడని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలను పీడిస్తున్నాడన్నారు. అన్న క్యాంటీన్లు, డ్రిప్ ఇరిగేషన్, చంద్రన్న బీమా వంటి 100 సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేశారని దుయ్యబట్టారు. టీడీపీ అధికారం లోకి వస్తే సంక్షేమ కార్యక్రమాలు ఆపేస్తామని వాలంటీర్ల చేత తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని... కార్యకర్తలంతా గతంలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లి వారికంటే మెరుగైన సంక్షేమం అందిస్తామని చెప్పాలని పిలుపునిచ్చారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణసౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పాఠశాలలకు వెళ్లే పిల్లలకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ప్రైవేటీకరణ చేయనీయమని అవసరమైతే వచ్చే మన ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఉత్తరాంధ్రను విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డికి అప్పగిస్తే వారు దోచుకుంటున్నారన్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తామని చెప్పి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయలేదని, వంశధార, తోటపల్లి, నాగావళి ప్రాజెక్టుల పెండింగ్ పనులు ఎక్కడవి అక్కడే ఉన్నాయన్నారు. మూతబడిన చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామని చెప్పి ఆ ఊసే ఎత్తడం లేదని, మన ప్రభుత్వం అధికారం లోకి వస్తె పెండింగ్ ప్రాజెక్టు లు అన్ని పూర్తి చేస్తామన్నారు. సైకో పాలన సాగనంపేందుకు టీడీపీ జనసే న కలిసి పనిచేస్తున్నాయని ఎటువంటి అపోహలు లేకుండా ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు కున రవికుమార్, నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, సర్పంచ్ ల సంఘం రాష్ట్ర నాయకులు గొండు శంకర్, జన సేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, నియోజక వర్గాల జనసే న నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫరూక్ అబ్దుల్లాకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజా సమన్లు జారీ చేసింది. జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నిధుల దుర్వినియోగానికి సంబంధించిన పాత కేసులో శ్రీనగర్‌లోని ఈడీ కార్యాలయం ముందు మంగళవారం హాజరుకావాలని కోరింది. 86 ఏళ్ల ఫరూక్ అబ్దుల్లాను జనవరి 11న తమ ముందు హాజరుకావాలని ఇటీవల ఈడీ సమన్లు జారీచేసినప్పటికీ ఆయన ఆరోగ్య కారణాల రీత్యా హాజరుకాలేదు. ఫరూక్ అబ్దుల్లా 2001-2012 మధ్య కాలంలో జేకేసీఏ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు కుంభకోణం జరిగిందని సీబీఐ ఆరోపణగా ఉంది. జేకేసీఏకు బీసీసీఐ రూ.112 కోట్లు కేటాయించిందని, వీటిలో 43.6 కోట్ల మేర కుంభకోణం జరిగిందని సీబీఐ 2018లో ఛార్జిషీటు నమోదు చేసింది. జేకేసీఏ ఆఫీసు బేరర్లతో సహా వివిధ వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు అక్రమంగా నిధులను మళ్లించారని సీబీఐ ఆరోపిస్తోంది. సీబీఐ ఛార్జిషీటు ఆధారంగా 2022లో ఫరూక్ అబ్దుల్లాపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

రండి! దర్శించండి! తరించండి!

శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం

పెనుగంచిప్రోలు, ఎన్టీఆర్ జిల్లా

శ్రీ అమ్మవారి పెద్ద తిరునాళ్ళు (కళ్యాణమహోత్సవం) వివరములు - 2024

వ. సం.	తేది మరియు వారము	వివరము
1	ది.23.02.2024 శుక్రవారం	అఖండ జ్యోతి స్థాపన ఉదయం గం. 06:01ని.లకు హోమగుండ ప్రజ్వలన అనంతరం శివాలయములో తిరుముడి పూజా ప్రారంభం భక్తులకు అన్నదానం ఉదయం గం. 10:00 ని. ప్రారంభం శ్రీ అమ్మవారి వార్షిక కళ్యాణ మహోత్సవము రాత్రి గం. 09:23 ని
2	ది.24.02.2024 శనివారము	జలబిందెల మహోత్సవము మధ్యాహ్నం గం.02:36 ని.లకు
3	ది.25.02.2024 ఆదివారము	ఉదయ పొంగళి, అంక సేవ ఉదయం గం. 10:30 ని.లకు
4	ది.26.02.2024సోమవారము	దీవెన బండారు రాత్రి గం.10:18 ని.లకు
5	ది.27.02.2024 మంగళ వారము	పూరాహుతి ఉదయం గం. 10:31 ని.లకు శ్రీ అమ్మవారి పెద్ద తిరునాళ్ళ పూర్తి

శ్రీ అమ్మవారి సేవలో

జె.శ్రీనివాసరావు
చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు

కె.రమేష్‌నాయుడు
డిప్యూటీ కలెక్టర్ & కార్యనిర్వహణాధికారి

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.